ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
fb.com/vaartha Digital
Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam
నల్లగొండ
5-11-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 276 పేజీలు: 8+16 వెల: 6.50

ఉత్తమ సిఎంగా యోగి ఆదిత్యనాథ్ — 5

సంక్షేమ పథకాలకు ఇకపై ఓటరు కార్డు లింకు

ఉభయ సభల్లో విపక్ష డెమొక్రాట్ల ఆధిపత్యం
కీలక రాష్ట్రాల గవర్నర్‌లు డెమొక్రాట్ల వశం
రిపబ్లికన్ల కోటలకు బీటలు.. డెమొక్రాట్ల పాగా
94యేళ్ల తర్వాత కాన్సాస్‌లో డెమొక్రాట్ విజయం
పలువురు ప్రవాస భారతీయులు గెలుపు
ట్రంప్ నామినేట్ చేసిన సరిత కొమారెడ్డి ఓటమి
ఓహియోలో వివేక్ రామస్వామి పరాజయం
యుఎస్ చరిత్రలో తొలిసారి ముస్లిం సెనేటర్
నేనే బరిలో ఉంటే ఫలితాలు వేరేలా ఉండేవి: ట్రంప్

ట్రంప్‌కు షాక్!

మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు ఘోర పరాజయం



ప్రతిపక్ష పార్టీ విజయాలను స్వాగతిస్తున్నా..
డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా: అధ్యక్షుడు డొనాల్డ్
మస్క్ మద్దతు ఉన్నా రిపబ్లికన్లకు ఎదురుదెబ్బ
ఐక్యతను కోరుకున్న అమెరికన్లు: ఒబామా

వాషింగ్టన్, నవంబరు 4: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అగ్రరాజ్య పార్లమెంటులోని ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటిలోనూ డెమోక్రాట్లు స్పష్టమైన మెజారిటీ సాధించి పట్టు సాధించారు. రెండవ విడత అధ్యక్ష >>2


పెద్దవాగుకు గండి పడిన దృశ్యం

'పెదవాగు'కు మళ్లీ గండి

కొట్టుకుపోయిన రింగ్‌బండ్
వందలాది ఎకరాల వరిపంట నాశనం
తెగిన దొంతికుంట చెరువు
లోతట్టు ప్రాంతాలు జలమయం
సాధారణ జనజీవనం అస్తవ్యస్తం

అశ్వారావుపేట, నవంబరు 4, ప్రభాతవార్త: మురును తుఫాన్ అశ్వారావుపేటతో పాటు యావత్ నియోజకవర్గాన్ని అతలాకుతలం చేసింది. దమ్మపేట, ముల్కలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల్లో జలవిలయం ఓ ఆటాడుకున్నది. సత్తుపల్లి అశ్వారావుపేట, పాల్వంచల మధ్యన వరద బీభత్సానికి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దమ్మపేట అశ్వారావుపేట పట్టణాలు మూడువంతులకుపైగా వరదల్లో మునిగిపోయింది. 03.11.2026 తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 04.11.2026 ఉదయం 7 గంటల వరకూ ఈ ప్రాంతంలో 128.9 ఎంఎం వర్షపాతం నమోదు కాగా..,అదే 04.11.2026 ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో 220.08 ఎంఎం అత్యధిక వర్షపాతం రికార్డు కావడం గడచిన మూడుదశాబ్దాల కాలంలో మునుపెన్నడూ లేకపోవడం గమనార్హం. దీంతో >>2

విద్యార్థులు కోరినట్లే యూనిఫాం

అభిప్రాయాలు సేకరించండి
రంగు, డిజైన్లపై ప్రత్యేక దృష్టి
యూనిఫాం.. కిట్ల పంపిణీకి విధి విధానాలు
సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్,నవంబరు4,ప్రభాతవార్త: విద్యార్థులకు అందించిన యూనిఫాంలపై వారినుంచి అభిప్రాయాలు (ఫీడ్ బ్యాక్) సేకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, కిట్ల పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. గతంతో పోలిస్తే ఎంతో నాణ్యమైన యూనిఫాంలు, ఆకర్షనీయమైన రంగులు, డిజైన్లతో అందజేశామన్నారు. అయితే, ఆయా రంగులు, డిజైన్లకు సంబంధించి విద్యార్థుల నుంచి అభిప్రాయాలు (ఫీడ్‌బ్యాక్) సేకరించాలన్నారు. అలా చేస్తే ఎక్కువ మంది విద్యార్థులు కోరుకునే రంగులు, డిజైన్లకు భవిష్యత్‌లో ప్రాధాన్యమివ్వచ్చని అన్నారు. యూనిఫాంలతో పాటు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, షూలు, సాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, కార్పెట్లు, స్కూల్ బ్యాగుల పంపిణీ దాదాపు పూర్తయిందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఒకట్రెండు సంస్థల పరిధిలో కొన్ని వస్తువుల పంపిణీ 95 శాతం వరకు పూర్తయిందని చెప్పారు. ఆ వస్తువుల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాదికి విద్యార్థులకు అందజేసే యూనిఫాంలు, ఇతర సామగ్రికి సంబంధించి విధి విధానాలను (ఎస్‌ఓపీ) రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యార్థులకు >>2


హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సదర్ వేడుకల్లో కరవాలంతో సిఎం రేవంత్, ఆర్డేడి నేత తేజస్వియాదవ్, ఎస్పీ ఎంపి ధర్మేంద్ర, బండారు దత్తాత్రేయ

రాష్ట్ర పండుగగా సదర్

సమ్మేళనం నిర్వహణకు రూ.5 కోట్లు కేటాయించాం
సదర్ వేడుకల్లో సిఎం రేవంత్‌రెడ్డి
యాదవులకు కీలక హామీలు

హైదరాబాద్ (ముషీరాబాద్), నవంబరు 4, ప్రభాతవార్త: హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ సంకల్పానికి యాదవుల సంపూర్ణ సహకారం ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. మూసీ పునరుజ్జీవనం, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్డు, భారత్ ఫ్యూచర్ >>2

నేడు కేబినెట్ భేటీ

గ్లోబల్ సమ్మిట్, మెట్రో రైల్, మూసీ ప్రాజెక్టు అజెండా 2

డీప్‌టెక్ ఆవిష్కరణలకు రాష్ట్రంలో

అవకాశాలు

పెట్టుబడులకు అనుకూల విధానాలు
అత్యుత్తమ మౌలిక వసతులు
3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం: డి.సిఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: తెలంగాణలో డీప్‌టెక్ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ వాటిని ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పులు తీసుకొచ్చే ఉత్పత్తులు, సేవలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పాల్గొన్న ఆయనకు మాట్లాడుతూ పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో



పనిచేసినప్పుడే సాంకేతిక ఆవిష్కరణలకు నిజమైన సార్థకత లభిస్తుందన్నారు. తెలంగాణను పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూలమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలు, విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. 2034-35 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా,2047 నాటికి3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పరిశ్రమలకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐఐటీలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్ ఐటీలు, ప్రముఖ ఇంజినీరింగ్ విద్యాసంస్థలు రాష్ట్రానికి ప్రధాన బలమన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో పాటు హిల్ట్ పాలసీ వంటి వినూత్న విధానాలు పారిశ్రామిక అభివృద్ధికి మరింత >>2



మేడ్చల్‌లో దీపావళి పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి

ఇప్పటి దాకా 2,21,500 గృహప్రవేశాలు
హైదరాబాద్ తరహాలో 4 కార్పొరేషన్లల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం
మేడ్చల్ కలెక్టరేట్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి
'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పోస్టర్‌ను ఆవిష్కరణ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 4, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లల్లో ఈ సారి దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవటం జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల వెలిగే ప్రతి దీపం తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి ప్రతీక అని, దీనిలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచారం శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపు >>2

బేతుపల్లి చెరువులో విషాదం

ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది 11 మంది సహా ఐదుగురు మత్స్యకారులు గల్లంతు
రక్షణ చర్యలు చేపడుతుండగా కొట్టుకుపోయిన రెండు బోట్లు
ముగ్గురు జాలర్ల ప్రాణాలు కాపాడిన రక్షక దళాలు
ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి ఆరా.. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం


పాలేరు వాగుపై నిర్మించిన తాత్కాలిక రహదారి కోతకు గురైన దృశ్యం

సత్తుపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త: ఖమ్మం జిల్లాలోని బేతుపల్లి చెరువులో భారీ విషాదం చోటుచేసుకుంది. వరద నీటిలో చిక్కుకున్న మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లిన రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) సిబ్బంది ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. నీటి ప్రవాహ ఉధృతికి వారు ప్రయాణిస్తున్న రెండు బోట్లు కొట్టుకుపోవడంతో తీవ్ర ఆందోళన నెలకొంది.అసలేం జరిగిందంటే.. బేతుపల్లి చెరువులో చేపలవేటకు వెళ్లిన 8 మంది మత్స్యకారులు వరద నీటి ఉధృతికి చెరువు మధ్యలోనే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. ప్రాణాలకు తెగించి చెరువులోకి వెళ్లిన రెస్క్యూ సిబ్బంది, తొలుత ముగ్గురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం మిగిలిన ఐదుగురిని రక్షించేందుకు >>2

మోడీ.. దేశ ద్రోహి

ఐదు నిముషాల్లో నిరూపిస్తా
యేడాదిలో ప్రభుత్వం పతనం
పంజాబ్ ర్యాలీలో రాహుల్ గాంధీ



అమృత్‌సర్, నవంబరు 4: కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు సంధించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశద్రోహి అని, ఆయన్ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంత్రిస్తున్నారని, తనతో చర్చకు వస్తే ఆ విషయాన్ని 5 నిమిషాల్లో నిరూపిస్తానని అన్నారు. ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు అంటున్నారని చెప్పారు. కానీ లోక్‌సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని రాహుల్ తెలిపారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు షా మూడు సంవత్సరాల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో లేదో అని రాహుల్ సెటైర్ వేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో గుజరాత్‌లోని అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటని ప్రశ్నించారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో జరిగిన ఇన్సాఫ్ ర్యాలీలో రాహుల్ గాంధీ ఈ మేరకు ప్రభుత్వం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనతో చర్చకు రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విసిరిన సవాల్ గురించి రాహుల్ ప్రస్తావించారు. "నాతో ముఖాముఖి చర్చకు రావాలని నరేంద్ర మోడీకి సవాలు విసిరాను. ఆ చర్చకు మధ్యవర్తిగా ఎవరినైనా (న్యాయనిర్ణేతగా) ఎంచుకోవచ్చునని చెప్పాను. ఒకవేళ మోడీ నాతో చర్చకు కూర్చుంటే, ఐదు నిమిషాల్లోనే, ఆయన ఒక దేశద్రోహి అని, ఆయన్ను డోనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని నేను నిరూపించగలనని రాహుల్ గాంధీ ఆరోపించారు. పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీపై కూడా రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని భగవంత్ మాన్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. వారు ఎక్కడ నిర్మూలించారు? పంజాబ్‌లో ఏ ఒక్క ప్రాంతం నుంచైనా వారు డ్రగ్స్‌ను తొలగించగలిగారా? ఈ సమస్యను అంతం చేసే సామర్థం వారికి అస్సలు లేదు. చాలా ఏళ్ల క్రితం, నేను మొదటిసారి పంజాబ్‌ను సందర్శించినప్పుడు, మాదకద్రవ్యాల సమస్య విస్తరిస్తోందని చెప్పాను. అప్పుడు ప్రతిపక్షాలైన బీజేపీ, అకాలీదళ్, ఇతర పార్టీలు, రాహుల్ గాంధీకి పంజాబ్ గురించి ఏమీ తెలియదు, రాష్ట్రంలో డ్రగ్స్ సమస్య ఏమీ లేదు అని వాదించాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పంజాబ్‌లో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలాను పగటి పూట అందరూ చూస్తుండగానే హత్యం చేయడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. పంజాబ్, దేశం కోసం పనిచేయాలని ఆశించే ఎవరినైనా బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం, చివరకు పగటిపూట అందరి కళ్లముందే కాల్చి చంపడం జరుగుతోందని ఆరోపించారు. పంజాబ్ ప్రజలకు తమకోసం పనిచేసే ప్రభుత్వం కావాలని, దిల్లీ నుంచి నడిపించే ఆప్ లాంటి సర్కార్ కాదంటూ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. యువతకు ఉద్యోగాలు, డ్రగ్స్ రహిత పంజాబ్ కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాహుల్ పిలుపునిచ్చారు.

'అగ్నివీర్'లకు శుభవార్త



పదవీకాలం రెండేళ్లు పెంపు
ఆరేళ్లకు పెరిగిన సేవా కాలం
కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం
రూ.14,500 కోట్లతో 92 గిగావాట్-అవర్ల ఎనర్జీ స్టోరేజ్,
రూ.97,600 కోట్ల పెట్టుబడులకు అవకాశం

ఇద్దరు పిల్లల నిబంధన పునఃపరిశీలించండి

కేంద్ర, రాష్ట్రాలకు 'సుప్రీం' సూచనలు 2



అంతర్జాతీయ ఫేక్ కాల్‌సెంటర్ గుట్టురట్టు

మూడేళ్లలో రూ. 400 కోట్ల లూటీ
ఇడి ఆపరేషన్‌లో ముగ్గురు అరెస్టు
కోర్టుకు తరలింపు.. రిమాండ్ విధింపు

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని క్రిప్టో కరెన్సీ, డిజిటల్ అరెస్ట్ పేరుతో సాగిస్తున్న అంతర్జాతీయ సైబర్ >>2

‘మురసు’ బీభత్సం

పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

లోతట్టు ప్రాంతాల జలమయం

పలు గ్రామాలకు రాకపోకలు బంద్

నీట మునిగిన పంట పొలాలు

సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



బుధవారం ఖమ్మం జిల్లాలో వరదనీటిలో పంట చేలు

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: తెలంగాణలో మురసు తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటిన ఈ తుఫాన్ బలహీనపడి వాయుగుండంగా మారి తెలంగాణ వైపు దూసుకువచ్చింది. తుఫాను రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. తుఫాన్ ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్, మహబూబాబాద్, కొత్త గూడెం జిల్లాల్లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. ఈదురు గాలులతో కూడిన వర్షాలకు వరి, పత్తి, మిర్చి వంటి నిల్వ ఉన్న పంటలు నేలమట్టమయ్యాయి. కొత్తగూడెం, సత్తుపల్లి, మణుగూరు ప్రాంతాల్లోని సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. పలు చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాములేరు వాగు ఉప్పెన కారణంగా ములకలపల్లి , దామరచర్ల జాతీయ రహదారి 221 కొట్టుకుపోయింది. మదరంసత్తుపల్లి రహదారిపై అంజనపురం వద్ద కాజ్‌వే మునిగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. కొత్తగూడెం జిల్లా ములకలపల్లిలో అత్యధికంగా 23.5 సెంటీమీటర్లు, వేంసూరులో 20.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా అశ్వారావుపేట మండలంలో అత్యధికంగా 27.6 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదు కాగా, మల్కారంలో 18.8 సెం.మీ, అంకంపాలెంలో 17.5 సెం.మీ, ములకలపల్లిలో 14.8 సెం.మీ మేర వర్షపాతం నమోదైంది. ఇదే జిల్లా అశ్వారావుపేట మండలం కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గుమ్మడవల్లి వద్ద ఉన్న పెద్దవాగు మధ్య తరహా ప్రాజెక్టు రింగ్ కట్ట మరోసారి తెగిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద పోటెత్తడంతో కట్టపై ఒత్తిడి పెరిగి గండి పడింది. దీంతో ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు దిగువకు ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు గ్రామాల్లోకి వరద నీరు ముంచెత్తడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వేలేరుపాడు మండలంలోని ముంపు గ్రామాల ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సురక్షి త ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని అధికారులు ఆదేశించారు. మురసు తుఫాను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీభత్సం సృష్టించింది. గత 24 గంటల్లో పలు మండలాల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. బుధవారం వాగులు పొంగిపొర్లడంతో అనేక గ్రామాలకు రవాణా నిలిచిపోయింది. కొత్తగూడెంలోని ములకలపల్లి, దమ్మపేటలో వరుసగా 23.1సెం.మీ, 21.4సెం.మీ వర్షపాతం నమోదుకాగా, ఖమ్మం సత్తుపల్లిలో 21.8సెం.మీ.ల తీవ్ర వర్షపాతం నమోదైంది. వేంసూరు, జూలూరుపాడు, పెనుబల్లి, అశ్వారావుపేట, భద్రాచలం, చుంచుపల్లి, మధిర, ఏన్కూరు, తల్లాడ, బూర్గంపాడు, పాలేంచ, కొత్తగూడెంలో భారీ వర్షం కురిసింది. బలమైన గాలులతో కూడిన తుఫాను వర్షాల కారణంగా అనేక మండలాల్లో వరి, పత్తి, మిరప వంటి నిలబడి ఉన్న పంటలు దెబ్బతినగా, కోత కోసిన పంటలు తడిసిపోయాయి. కొత్తగూడెం, సత్తుపల్లి, మణుగూరులోని ఎస్సీసీఎల్ ఓపెన్‌కాస్ట్ గనులలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఇటీవల రాజుపేట శివార్లలో పాములేరు వాగుపై కూలిపోయిన వంతెన పక్కన నిర్మించిన తాత్కాలిక రహదారి వరద నీటికి కొట్టుకుపోయింది. దీని ఫలితంగా, ములకలపల్లి-దమ్మపేట జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

రాష్ట్ర పండుగగా సదర్

>> సిటీ ప్రాజెక్టులతో మరింతగా అభివృద్ధి సాధించి, దేశంలోనే ఆదర్శనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో పెద్దఎత్తున నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, యాదవ సోదర సోదరీమణులందరికీ హైదరాబాద్ సదర్ ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యాదవ సోదరుల ఆత్మగౌరవానికి ఎక్కడా లోటు లేకుండా చూసే బాధ్యత తమదని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరాభివృద్ధిలో యాదవ సోదరుల కృషి ఎంతో ఉందన్నారు. దేశంలో ఎక్కడి నుంచి ఏ పని కోసమైనా నగరానికి వచ్చిన వారందరినీ యాదవ సోదరులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో, ఇక్కడ శాంతి భద్రతలను కాపాడటంలో యాదవుల పాత్ర ఎంతో ఉందని ప్రశంసించారు. హైదరాబాద్ నగరం జాతీయస్థాయిలో పేరు ప్రతిష్ఠలను సాధించి అభివృద్ధి చెందిన నగరంగా నిలబెట్టడంలో యాదవ సోదరులు కష్టపడాలని కోరారు. యాదవుల ఆత్మగౌరవం, హక్కులను కాపాడే విషయంలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసే బాధ్యత తనదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహించలేదని గుర్తుచేస్తూ, తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే యాదవ సోదరుల విజ్ఞప్తి మేరకు సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర ఉత్సవంగా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు విడుదల చేసినట్టు తెలిపారు.హైదరాబాద్ నగరంలో ఇప్పటి గోల్కొండ కోట ఒకనాటి గొల్లకొండ అని ప్రస్తావించారు. యాదవుల సహకారంతోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందని చెప్పారు. బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌తో పాటు ఎన్నో ప్రాంతాల నుంచి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని సదర్ ఉత్సవానికి మరింత శోభను తెచ్చారని వ్యాఖ్యానించారు. మొట్టమొదటిసారిగా కులగణన చేసి దేశానికి మార్గదర్శకంగా నిలబడ్డామని చెబుతూ, ఎవరెంత మేరకు ఉంటే అంత శాతం వాటా కల్పించాలన్న లక్ష్యంతో కులగణన చేశామని అన్నారు. యిరాబోయే రోజుల్లో యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సదర్ ఉత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంపీ ధర్మేంద్ర యాదవ్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పలువురు ప్రజాప్రతినిధులు, శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, వివిధ రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రతినిధులు పాల్గొన్నారు.



హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ సమ్మేళనం దృశ్యం

‘పెదవాగు’కు మళ్లీ గండి

>> ప్రధానంగా అశ్వారావుపేట పట్టణానికి పడమటి దిక్కునుంచి పెద్దఎత్తున వరద నీరు చేరి బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రజానీకాన్ని గడగడలాడించింది. గోగులబంధం, వడ్డెరబజార్, గౌడ్‌బజార్, గుర్రాలచెర్వు రోడ్ సమీపంలోని కాళింగుల బజార్ తదితర కాలనీలు చివురుటాకుల్లా వణికి పోయాయి. గడచిన కాలంలో గ్రామ పంచాయతీ ఎవరిఇష్టంవచ్చినట్లు వాళ్ళకి అడ్డగోలుగా నివాస గృహాల నిర్మాణ అనుమతులు ఇచ్చేసిన దుష్ఫలితం ఇన్నేళ్ళకు అందరికీ అనుభవంలోకి వచ్చింది. కాలువలు, నాలాలు, చెర్వు లోతట్టుల్ని ఆక్రమిస్తే ఎలా ఉంటుందో అశ్వారావుపేట పట్టణ ప్రజలకు తెలిసొచ్చింది. పైనుంచి వచ్చే వరద మొత్తం దొంతికుంటచెర్వు లోకి చేరి అది ఖమ్మం రోడ్ దాకా పోటెసింది. వందలాది నివాస గృహాలు ఇందులో మునిగి విలవిల్లాడాయి. ఇంతలోనే దొంతికుంట చెర్వుని మున్సిపల్ కమీషనరే దగ్గరుండి భారీ యంత్రాల సాయంతో గండి కొట్టించారని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరిగింది. ఈ పనే కనుక చేయకపోయి ఉంటే మరో అరగంట ఆలస్యమైనా అశ్వారావుపేట పట్టణం వరదల్లో కొట్టుకుపోయి ఉండేదని అందువల్ల కమీషనర్ చేసిన పని హర్షణీయమని పెద్దఎత్తున పట్టణ ప్రజల నుంచి ప్రశంశలు పొగయ్యాయి. అదే సమయంలో ఒకేసారి అంత పెద్దమొత్తపు వరద.., ఉప్పెనలా చెర్వునుంచి విడుదల కావడంతో అది కట్టకింది భాగంలోని పంట పొలాలమీదికి విరుచుకుపడింది. దాదాపు 10 మీటర్లమేర ఈ గండి పడినందున అనేకమంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఉధృతి ఇంకెంత విలయాన్ని సృష్టించిందో కాస్త సమయం గడిచాకగానీ తెలియదు. దీనిపై రైతు సంఘ నాయకుడు చెన్నూరి రామకృష్ణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది మున్సిపాలిటీ చేతగాని తనమనీ.,సాంకేతికంగా తప్పుడు డ్రెయిన్స్ నిర్మించడం.,నాలాల మీదా లేదా ఇదే దొంతికుంట చెర్వు బఫర్‌జోన్ ఆపై దీనికి ఆనుకుని ఉన్న నిషిద్ధ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా గృహ నిర్మాణాల అనుమతులివ్వడం వంటి అనేక అసమర్ధ పాలనల కారణంగా ఈరోజున ఇంత విపత్తు నెత్తినొచ్చిపడిందని, వారి తప్పు కప్పిపుచ్చుకోడానికి నిందు చెర్వుని ఇలా నిలువునా గండి కొట్టేయడం దారుణమని, దీనిపై తాము హైకోర్టులో కేసు వేస్తున్నామని.,ఎంతటివారినైనా వదిలేది లేదని తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. గండి పడిందని ఓ సారీ గండి కొట్టామని ఓ సారీ మున్సిపాలిటీ చాలాసేపు నాటకాలాడిందని, చివరికి వాట్సాప్ గ్రూపుల్లో కమీషనర్‌కి అనుకూలంగా పోస్టులు వచ్చేసరికి గండి కొట్టినట్లు మౌనంగా అంగీకరించారని దుమ్మెత్తిపోశారు. కనీసం హెచ్చరించకుండా ఇలా చెర్వుకి గండి కొట్టేస్తే కిందనున్న తామంతా ఎలా తట్టుకుంటామని అనుకున్నారని, న్యాయపోరాటానికి మున్సిపాలిటీ సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఇలా ఒకేసారి నీటిని వదిలేయడం మూలంగా పెను విధ్వంసం జరిగింది కూడా. ఊట్లపల్లి వైపు ప్రధాన రహదారి బాగా దెబ్బతిన్నది. ఓ టూవీలర్ రైడర్ ఉధృతిలో కొట్టుకుపోతుంటే పోలీస్ కానిస్టేబుల్ ఒకరు తెగించి కాపాడారు. కాగా రెండేళ్ళ క్రితం పెదవాగు ప్రాజెక్ట్ వరదలపాలైన విషయం తెలిసిందే కదా. 2024 జూలై 18 అర్ధరాత్రి పెను విధ్వంసం జరిగింది.

ఏకంగా లక్ష క్యుసెక్కుల వరదనీరు చేరి ఈ మధ్యతరహా సాగునీటి వనరుని తన్నుకుపోయింది. 250 మీటర్ల వరకూ ప్రధాన కరకట్టకు గండి పడింది. దాన్ని పూడ్చడానికి ఇటు తెలంగాణా అటు ఆంధ్రా ఈ రెండు ప్రభుత్వాల వల్లా ఇప్పటిదాకా చేతకాలేదనే విషయం కూడా అందరికీ తెలిసిందే. ఐతే ఏదో తాత్కాలిక ఉపశమనం కోసం తెలంగాణా ఇరిగేషన్ వారు ఓ విఫల ప్రణాళిక అమలు చేశారు. ఏదైతే ప్రధాన కట్టకు గండి పడిందో దానిచుట్టూ (రిజర్వాయర్ లోపలి వైపున) గుడ్రంగా రింగ్ ఆకారంలో మరో కట్టని నిర్మించి దీనికి “రింగ్‌బండ్” అని నామకరణం చేశారు. ఒకటా రెండా ఈ ఖర్చు ఏకంగా రూ.3కోట్లు. బిల్లు చెల్లింపు దశలో ఉండగానే అటు కాంట్రాక్టర్‌కి టోకెన్ కొట్టారో లేదో.,ఇటు తాజా వరదలకు ఈ “ఉంగరం” మళ్ళీ కొట్టుకుపోయి గోదాట్లో కలిసింది. గోవిందా...గోవింద. పెదవాగు కథ పరిసమాప్తం. 150 ఎకరాల వరి పొలాలను కూడా ఈ రింగ్ తనతోపాటు పట్టుకుపోయింది. రైతుకు కన్నీరే మిగిలింది. ఇకపై ఈ పెదవాగులో ఇలాంటి విఫల ప్రయోగాలెన్ని చేసినా ఫలితం శూన్యం. రూ.కోట్ల ప్రజాధనం కొట్టుకుపోవడం మినహా మరో ప్రయోజనాలేమీ ఉండవు.

ఇద్దరు పిల్లల నిబంధన పునఃపరిశీలించండి

కేంద్ర, రాష్ట్రాలకు ‘సుప్రీం’ సూచనలు

న్యూఢిల్లీ, నవంబరు 4: ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలకు మించి ఉండకూడదనే నిబంధన ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు సమంజసమని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశంలో సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించే చట్టాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. గత రెండు దశాబ్దాల్లో దేశ జనాభా పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం భారతదేశ మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1 అనే ప్రత్యామ్నాయ స్థాయి కంటే దిగువకు పడిపోయిందని గుర్తుచేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల జనాభా పెరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం ఇప్పటికీ అవసరమా అని ప్రశ్నించింది. మహారాష్ట్రలోని కాకోడా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మంగళ భీమ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మూడో సంతానం జన్మించడంతో ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించారు. ఆమె అప్పీల్‌ను అనుమతించిన సుప్రీంకోర్టు, అనర్హత నిర్ణయాన్ని రద్దు చేసింది. ఇదే అంశంపై 2003లో వెలువడిన జావేద్ వర్సెస్ హర్యానా రాష్ట్రం తీర్పును కూడా సుప్రీంకోర్టు పునఃపరిశీలనకు స్వీకరించింది. ఆ తీర్పును విస్తృత ధర్మాసనానికి నివేదించింది.

ట్రంప్‌కు షాక్!

>> బాధ్యతలు చేపట్టిన తొలి రెండేళ్లలోనే రెండు సభలపై నియంత్రణ కోల్పోవడం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాజకీయంగా పెద్ద షాక్. అయితే, ఈ పరాభవంపై స్వయంగా ట్రంప్ పలు అంతర్జాతీయ మీడియా సంస్థలతో మాట్లాడుతూ తమ పార్టీ ఓటమికి దారితీసిన ఐదు ప్రధాన కారణాలను విశ్లేషించారు. రిపబ్లికన్ల ఓటమికి ప్రధాన కారణాల్లో మొదటిది ఇరాన్ యుద్ధ ప్రభావమని ట్రంప్ స్వయంగా అంగీకరించారు. ఇరాన్‌తో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇది అమెరికాలోని సాధారణ కుటుంబాల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం మూపింది. ప్రజలు తన విధానాలను సమర్థించినప్పటికీ, పెట్రోల్‌గ్యాసోలిన్ ధరల తక్షణ భారాన్ని మోసేందుకు సిద్ధంగా లేరని, అదే ఎన్నికల్లో ద్రవ్యోల్బణాన్ని ప్రధాన సమస్యగా మార్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఓటమిని తన ప్రభుత్వ పాలనకు వ్యతిరేక తీర్పుగా భావించలేమని, రెండేళ్లలో తమ ప్రభుత్వం అద్భుతమైన పనితీరు కనబరిచిందని, అభ్యర్థుల అసమర్థతను ప్రభుత్వ విధానాలకు ఆపాదించడం సరికాదని స్పష్టం చేశారు. సంప్రదాయకంగా రిపబ్లికన్లకు అనుకూలంగా భావించే ప్రముఖ మీడియా ఛానల్ ఫాక్స్ న్యూస్ తీరుపై కూడా ట్రంప్ నిప్పులు చెరిగారు. ప్రత్యర్థి డెమోక్రటిక్ పార్టీ నేతలకు, విపక్షాలకు ఫాక్స్ న్యూస్ మితిమీరిన కవరేజీ ఇచ్చి తమ అవకాశాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. న్యూయార్క్ మాజీ మేయర్ బిల్ డి బ్లాసియో లాంటి విపక్ష నేతలకు ఎక్కువగా చోటు కల్పించడమే తమ ఓటమికి ఒక పరోక్ష కారణమని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ఆరోపించారు.

నేడు కేబినెట్ భేటీ

హైదరాబాద్,నవంబరు4,ప్రభాతవార్త: సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు సాయంత్రంసచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ అధికారిక భేటీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుండగా, దానికి ముందుగా మధ్యాహ్నం 3 గంటల సమయంలో మంత్రులతో సీఎం అనధికారికంగా సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారు. కేబినెట్ భేటీ వేళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో బుధవారం ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన ప్రధాన అజెండా ప్రతులు, చర్చించాల్సిన ముఖ్యాంశాలు, ప్రతిపాదిత బిల్లులను పరిశీలించి, కేబినెట్ ముందుకు తీసుకురావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను సీఎస్ పూర్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగ నియామకాలు, బడ్జెట్ కేటాయింపులపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. వీటితో పాటు రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రాజెక్టులకు భూ కేటాయింపులకు ఆమోదం తెలపడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు.



పాట్నాలో బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరితో భేటీ అయిన అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ

రాష్ట్రంలో అవకాశాలు

>> ఊతమిస్తాయని వెల్లడించారు. సాఫ్ట్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, ఇంజినీరింగ్ వంటి విభిన్న రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా ఉందని, ఈ సామర్థ్యాలన్నింటినీ సమన్వయం చేయడం ద్వారా డీప్‌టెక్ రంగంలో రాష్ట్రం ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు వేదికగా ఎదగగలదని అన్నారు. ప్రయోగశాలలో రూపొందిన ఆవిష్కరణకు తొలి వినియోగదారుడు దొరకడం, పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు లభించడం, పెట్టుబడులు సమకూరడం వంటి అంశాలు స్టార్టప్‌లకు ఎదురవుతున్న సవాళ్లని పేర్కొన్నారు. ఈ అడ్డంకులను ప్రభుత్వం, పరిశ్రమలు సంయుక్తంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన రంగంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగం, విద్యుత్ నిల్వ సాంకేతికత, విద్యుత్ సరఫరా వ్యవస్థల పనితీరు మెరుగుదల వంటి అంశాల్లో డీప్‌టెక్ ఆవిష్కరణలకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. వైద్య రంగంలో వ్యాధులను ముందుగానే గుర్తించే నిర్ధారణ పరికరాలు, వ్యవసాయ రంగంలో రైతులకు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి, దిగుబడులు పెంచే సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేయాలని సూచించారు.

ఏ సాంకేతిక ఆవిష్కరణ అయినా సామాన్య ప్రజలకు, రైతులకు అందుబాటు ధరల్లో ఉండేలా ప్రారంభ దశ నుంచే ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కూడా పెద్ద పరిశోధనా విభాగాలు ఏర్పాటు చేయకుండానే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునేలా సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు రంగం, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేసినప్పుడే పెద్దఎత్తున సంపద సృష్టి, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తూ, వారి పెట్టుబడులు వృద్ధి చెందేందుకు అవసరమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. తెలంగాణలో డీప్‌టెక్ అభివృద్ధికి అవసరమైన కొన్ని కీలక సవాళ్లను గుర్తించి, వాటి పరిష్కారానికి పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేసేలా చొరవ చూపాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి

>> నిచ్చారు. బుధవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌ను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబులు సందర్శించారు. ముందుగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 2,21,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తి జరిగి గృహప్రవేశాలు జరిగినట్లు తెలిపారు. ఈ దీపావళి రోజున ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి పండుగను ఘనంగా నిర్వహించాలని సూచించారు. దీపావళి పండుగను ప్రజలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు జరిగిన ప్రతి ఇంటిలో ప్రభుత్వ సంకల్పం వెలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఎన్నో అవరోధాలు ఎదుర్కొంటున్నా పేదల ఆత్మగౌరవానికి అయిన ఇందిరమ్మ ఇళ్ల పథకం గుర్తింపుగా నిలుస్తుందన్నారు. భద్రత, భరోసాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు సంకల్పంతో తొలివిడత 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా వీటిలో ఇప్పటి వరకు 2,21,500ఇళ్లు నిర్మాణం పూర్తి జరిగి గృహప్రవేశాలు పూర్తి అయినట్లు మంత్రి పొంగులేటి వివరించారు. మరో 1.90లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. గృహప్రవేశాలు జరుపుకున్న ఇళ్లకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహనిర్మాణ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు అందరు పాల్గొని ఇందిరమ్మ లబ్దిదారులతో కలిసి వారి ఆనందాల్లో భాగస్వాములు కావాలన్నారు. దీనికి సూచికగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు అనే పోస్టర్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి వర్గం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరుతుందని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా 4.50లక్షల ఇళ్లు, రెండవ విడతలో 2.50లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో లక్ష ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వివరించారు. హైదరాబాద్ తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పోరేషన్లలో కూడ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామన్నారు.

బేతుపల్లి చెరువులో విషాదం

>> రెండు ప్రత్యేక బోట్లలో 11 మంది ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది చెరువులోకి వెళ్లారు. అయితే, వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో రెండు బోట్లూ అదుపుతప్పి కొట్టుకుపోయాయి. దీంతో బోట్లలో ఉన్న 11 మంది లీడీలినీ సిబ్బందితో పాటు, చిక్కుకుపోయిన ఐదుగురు మత్స్యకారుల ఆచూకీ గల్లంతైంది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి తాజా పరిస్థితిపై ఆరా తీశారు. గల్లంతైన ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది, మత్స్యకారులను సురక్షితంగా కాపాడేందుకు సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ముఖ్యమంత్రి సూచించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది పరిస్థితిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో పాటు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు తక్షణమే అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. రంగంలోకి దిగిన సహాయక బృందాలు గల్లంతైన ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సమీప ప్రాంతంలో సురక్షితంగా ఉన్నట్లు గుర్తించాయి. వారిని మరో గంటలోగా ఒడ్డుకు చేర్చేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు మంత్రికి వివరించారు. సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేరుకునే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన రక్షణ పరికరాలు, బోట్లు అందుబాటులో ఉంచడంతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సహాయక చర్యల పురోగతిని జిల్లా కలెక్టర్‌తో ఎప్పటికప్పుడ

ఇడి విచారణకు అంబటి రాంబాబు హాజరు

హైదరాబాద్, నవంబరు 4, ప్రభతవార్త: ఎపిలో సంచలనం రేపిన లిక్కర్ స్కామ్‌కు సంబంధించి వైసీపీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరయ్యారు. మద్యం రవాణా కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ నిమిత్తం మంగళవారం ఆయనకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఎపి నుంచి ఉదయం 11 గంటల సమయంలో బషీర్‌బాగ్‌లోని ఇడి కార్యాలయానికి విచారణకు వచ్చారు. ఈ కేసులో విచారణకు రావాలని గతంలోనే ఇడి అంబటికి నోటీసులు ఇవ్వగా అనారోగ్య కారణాలతో ఆయన హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం నాటి విచారణకు తప్పనిసరి హాజరు కావాలని ఈడీ ఆదేశించడం విదితమే. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్లలో భారీగా అవకతవకలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ. 200 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని ఎపి సిఐడి కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి ఈ కేసులో దర్యాప్తు చేస్తోంది. కొందరికి అనుకూలంగా టెండర్ నిబంధనలు మార్చారని ఈ కేసు లో ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కేసులో ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండి దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, మాజీమంత్రి కారు మూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్‌కుమార్‌లను ఇడి అరెస్ట్ చేసింది.

చంద్రబాబు, లోకేష్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు: అంబటి ఆగ్రహం

ఇదిలా ఉండగా విచారణ తర్వాత మీడియాతో అంబటి మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ తనపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇడి విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ కుట్రతోనే ఇడి నోటీసులు జారీ చేసిందని, విచారణలో నాకు తెలిసిన సమాచారాన్ని చెప్పానని తెలిపారు. ఈ కేసులో ఏమీ లేదని తెలిపారు.

తెలంగాణ నీటి ప్రయోజనాలు ఎపికి తాకట్టు పెడుతున్న రేవంత్ సర్కార్

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పటం ద్వారా తెలంగాణ నీటి ప్రయోజనాలను రేవంత్ సర్కార్ ఏపీకి తాకట్టు పెడుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరిలో తెలంగాణకు దక్కాల్సిన 250 టీఎంసీల నీళ్ల వాటాను తన గురువు చంద్రబాబుకు గురుదక్షిణగా రేవంత్ రెడ్డి సమర్పించుకుంటున్నాడని విమర్శించారు. ఎన్ డబ్ల్యూడీఏ ఆధ్వర్యంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో పోలవరంబనకచర్ల ప్రాజెక్ట్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించటం వారి ద్వంద్వ విధానాలను తెలియజేస్తోందంటూ బుధవారం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. గోదావరి కావేరి నదుల అనుసంధానం సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) నుంచి చేపట్టాలని కూడా ఎన్ డబ్ల్యూడీఏ సమావేశాల్లో అధికారులు కోరారని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్ కు అనుగుణంగా నదుల అనుసంధానం జరిగేలా రేవంత్ సహకరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును నదుల అనుసంధానంలో భాగంగా చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి చేస్తోందని చెప్పారు.

హిందూ కాలేజ్‌ను ప్రైవేట్‌పరం చేస్తామంటే ఊరుకోం

ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కల్వకుంట్ల కవిత సంఘీభావం



విద్యార్థులకు మద్దతుగా ధర్నాలో కూర్చున్న కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని ప్రతిష్టాత్మక హిందూ కాలేజ్ ను ప్రైవేట్ పరం చేయాలని ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత కేంద్రాన్ని హెచ్చరించారు. కళాశాల ప్రత్యేక వారసత్వాన్ని, గుర్తింపును కాపాడుకునేలా, కాలేజ్ ను ప్రైవేట్ పరం చేసే ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు నెలన్నరగా విద్యార్థులు, కాలేజ్ ప్రొఫెసర్లు చేస్తున్న ఆందోళనకు ఆమె మద్దతు తెలిపారు. బుధవారం హిందూ కాలేజ్ లో ఆందోళన చేస్తున్న విద్యార్థులను కలిసి వారికి సంఘీభావం తెలిపారు. వారి పోరాటానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 130 ఏళ్లగా ఎంతో మంది మేధావులను అందించిన, చారిత్రక వారసత్వం కలిగిన ఈ కాలేజ్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ప్రైవేట్ సంస్థలు ఈ కాలేజ్ నిర్వహణకు నిధులు ఇచ్చినంతా మాత్రాన వారికే దాన్ని కట్టబెట్టాలని చూడటం ఎంతమాత్రం సరికాదన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం డొనేషన్లు ఇస్తున్న ప్రైవేట్ సంస్థలకు పరిమితమైన సౌకర్యాలు మాత్రమే కల్పించాలని సూచించారు. నిధుల పంకతో కాలేజ్ ను ప్రైవేట్ వారికి అప్పగించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు.కాలేజ్ అడ్మిషన్లలో జరుగుతున్న అవకతవకలు, కాలేజ్ ను ప్రైవేట్ పరం చేసే ప్రయత్నాలపై విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలపై కేంద్రం ఎందుకు మౌనంగా ఉందో చెప్పాలన్నారు. విద్యార్థుల గొంతు నొక్కాలని ప్రయత్నిస్తే ఆందోళనలు మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వారికి అండగా తాము నిలబడతామన్నారు.

'అగ్నివీర్'లకు శుభవార్త.. పదవీకాలం రెండేళ్లు పెంపు

- ఆరేళ్లకు పెరిగిన సేవా కాలం
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం
- రూ.14,500 కోట్లతో 92 గిగావాట్-అవర్ల ఎనర్జీ స్టోరేజ్,
- 'క్రిటికల్ మినరల్స్' ప్రాసెసింగ్ పథకాలకు ఆమోదం
- రూ.97,600 కోట్ల పెట్టుబడులకు అవకాశం



న్యూఢిల్లీ, నవంబరు 4: ఆర్మీలో అగ్నిపథ్ పథకం కింద విధుల్లో చేరిన అగ్నివీర్ ల కోసం కేంద్ర ప్రభుత్వం తీపికబురు ఇచ్చింది. తొలి నాలుగు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న అగ్నివీర్లలో ఏకంగా 75 శాతం మందికి మరో రెండేళ్లపాటు సేవలను పొడిగించే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల అగ్నివీర్ల మొత్తం సేవా కాలం ఆరు సంవత్సరాలకు పెరుగుతుంది. ఈ అదనపు సేవా కాలం పూర్తయిన తర్వాత వారి ప్రతిభ, క్రమశిక్షణ, బాధ్యతల ఆధారంగా సైన్యంలో శాశ్వత ప్రాతిపదికన రెగ్యులర్ సర్వీసులోకి తీసుకోవడానికి అవకాశం లభిస్తుంది. ఈ వివరాలను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ రాజా రమణ కొద్దిసేపటి కిందటే వెల్లడించారు. ఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి బ్యాచ్ అగ్నివీర్ల నాలుగు సంవత్సరాల పదవీకాలం ముగింపునకు రావడం, వారి సేవలు, పనితీరుపై సైనిక దళాల నుంచి అత్యంత సానుకూల స్పందన లభించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. త్రివిధ దళాలు ఇచ్చిన సిఫారసుల ప్రాతిపదికన కేంద్ర కేబినెట్ ఈ పొడిగింపునకు ఆమోదముద్ర వేసిందని తెలిపారు. ఈ నూతన మార్గదర్శకాల ప్రకారం.. ఎంపిక చేసిన అగ్నివీర్లకు రక్షణ దళాల్లో తమ నైపుణ్యాలను నిరూపించుకోవడానికి మరింత సమయం లభిస్తుంది. అదనపు రెండేళ్ల కాలంలో వారి దేవాదారుధ్యం, వివిధ సైనిక బాధ్యతలను స్వీకరించే సామర్థం, సాంకేతిక పరిజ్ఞానం, సైనిక నిబంధనలకు అనుగుణంగా వారి పనితీరును అంచనా వేస్తారు. అగ్నిపథ్ పథకం శారీరక శిక్షణకే పరిమితం కాకుండా, మానసిక వికాసం, టెక్నాలజీపై అవగాహన, నైతిక విలువలను పెంపొందించేలా రూపుదిద్దుకుందని సీడీఎస్ రాజా రమణ స్పష్టం చేశారు.

విద్యుత్ నిల్వ సామర్థం పెంపునకు కేంద్రం రూ.14,500 కోట్ల పథకం

దేశంలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం రూ.14,500 కోట్లతో కూడిన సాధ్యత అంతర నిధుల (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ - జుబిని) పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా 2026-27 నుంచి 2030-31 మధ్య దేశవ్యాప్తంగా 92 గిగావాట్ అవర్స్ గ్రిడ్ స్థాయి ఇంధన నిల్వ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దేశానికి నిరంతరాయంగా, సరసమైన ధరలకు విద్యుత్ అందించడంతో పాటు, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద 60గిగావాట్ల సామర్థంతో జల పంపింగ్ ఆధారిత విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు , 30 గిగావాట్ల సామర్థంతో బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థలు, మరో 2 గిగా వాట్ల సామర్థ్యంతో అభివృద్ధి చెందుతున్న ఇతర ఇంధన నిల్వ సాంకేతికతలకు ప్రభుత్వం సహకారం అందించనుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు రూ.97,600 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రతిపాదిత అదనపు నిల్వ సామర్థం ప్రస్తుతం దేశంలో ఉన్న గ్రిడ్ స్థాయి నిల్వ సామర్థ్యానికి దాదాపు 170 శాతానికి సమానం. 203132 నాటికి దేశానికి అవసరమయ్యే 411 గిగావాట్ల నిల్వ సామర్థ్యాన్ని సాధించడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఇంధన నిల్వ ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యాసాధ్యాలను మెరుగుపరిచి, భారీ స్థాయి నిల్వ మౌలిక సదుపాయాల ఏర్పాటును వేగవంతం చేయడమే ఈ పథకం ద్వారా అందించే ఆర్థిక సహాయం లక్ష్యం. ఇంధన నిల్వ సామర్థ్యాన్ని టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్ విధానం ద్వారా కేటాయించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన విద్యుత్ పంపిణీ సంస్థలు బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పొందేందుకు అర్హత కలిగి ఉంటాయి. ప్రత్యామ్నాయ ఇంధన నిల్వ సాంకేతికతల ఆధారిత ప్రాజెక్టులను కూడా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు చేపట్టవచ్చు. దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడంపై ఈ పథకం ప్రత్యేక దృష్టి సారించింది. బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థల ప్రాజెక్టుల్లో కనీసం 40 శాతం దేశీయ ఉత్పత్తుల వినియోగం తప్పనిసరి (డొమెస్టిక్ కంటెంట్ రిక్వైర్‌మెంట్) చేయనున్నారు. దీనివల్ల దేశీయంగా బ్యాటరీల తయారీ ప్రోత్సాహం పొందడంతో పాటు, దిగుమతులపై ఆధారపడటం తగ్గనుంది. ఈ నిబంధన భారతీయ తయారీదారులకు కొత్త అవకాశాలను కల్పించడంతో పాటు, బ్యాటరీ తయారీ రంగానికి ఇప్పటికే ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలకు మరింత తోడ్పాటునివ్వనుంది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో ఉండే హెచ్చుతగ్గులను అధిగమించేందుకు ఈ పథకం దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. సౌర, పవన విద్యుత్ వంటి వనరుల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను నిల్వ చేసి అవసరమైన సమయంలో వినియోగించుకోవడానికి ఈ వ్యవస్థలు ఉపయోగపడతాయి. గ్రిడ్ స్థాయి ఇంధన నిల్వ వ్యవస్థలు విద్యుత్ సరఫరా, డిమాండ్ మధ్య సమతుల్యతను కాపాడటంతో పాటు, గ్రిడ్ స్థిరత్వాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పుడు కూడా వినియోగదారులకు విద్యుత్ అందుబాటులో ఉండేలా చేస్తాయి. దీంతో నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తి వనరులపై ఆధారపడటం తగ్గుతుందని, దేశ విద్యుత్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా, స్థిరంగా, పటిష్టంగా మారుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.



ఎపిపిఎస్‌సి 2018 గ్రూప్-1 స్కాంపై ఇడి సోదాలు

విశ్రాంత ఐపిఎస్ పిఎస్ఆర్ ఆంజనేయులుసహా పలువురి ఇళ్లు కార్యాలయాల్లో తనిఖీలు.. కీలక పత్రాలు జప్తు

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: ఎపిలో వైకాపా హయాంలో 2018లో గ్రూప్ 1 పరీక్షకు సంబంధించి వెలువడిన నోటిఫికేషన్‌లో భారీగా అక్రమాలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం నాడు తె లుగు రాష్ట్రాల్లో ఏకకాలంలో పలుచోట్ల దాడులు నిర్వహించారు. నాటి ఎపిపిఎస్‌సి కార్యదర్శి, విశ్రాంత ఐపిఎస్ అధికారి పిఎస్ఆర్ ఆంజనేయు లుతో పాటు ఇతర సభ్యులు, వారి అనుచరుల ఇళ్లు కార్యాలయాల్లో ఈడీ అధికారులు పలు బృందాలుగా విడిపోయి సోదాలు నిర్వహించారు. అప్పట్లో జరిగిన గ్రూప్1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనంలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణలు రాగా ఇది నిజమని ఇటీవల సి ఐడి అధికారుల బృందం తేల్చింది. 2018లో విడుదలైన గ్రూప్1 నోటిఫికేషన్‌కు సంబంధించి 2020లో మెయిన్స్ పరీక్షలు జరగగా నిబంధన్‌లకు విరుద్ధంగా గ్రూప్ 1 జవాబు పత్రాలను ఏపీపీఎస్సీ ఆఫీస్ నుండి మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌కు తరలించి, అక్కడ 84 రోజుల పాటు ఉంచినట్లు సిఐడి సిట్ బృందం అధికారులు తేల్చారు. దీంతో పాటు ఎలాంటి సీసీటీవీ నిఘా లేకుండా, అర్హత లేని 66 మంది వ్యక్తులతో జవాబు పత్రాలను దిద్దించి మార్కులు వేయించారని సిట్ తన నివేదికలో పేర్కొంది.

ఈ ప్రక్రియ కోసం క్యామ్‌సైన్ మీడియా అనే సంస్థకు కోటీ 14 లక్షల రూపాయలు. ఇతర ప్రైవేట్ సంస్థలకు కోటీ 38 లక్షల రూపాయలు నిబంధనలకు విరుద్ధంగా చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి. సిట్ నివేదిక ఆధారంగా విజయవాడ సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో 2025లో నమోదైన క్రిమినల్ కేసును ఆధారంగా ఈ కేసులో మనీలాండరింగ్ జరిగినట్లు నిర్ధారించిన ఈడీ దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేబట్టింది. ఈ గోల్‌మాల్‌కు నాటి ఎపిపిఎస్‌సి కార్యదర్శి పిఎస్ఆర్ ఆంజనేయులు సూత్రధారి అని ఆయనతో పాటు మరికొందరు భారీగా లబ్ధిపొందారని ఈడీ ఆరోపిస్తోంది. ఇందుకు సంబంధించి బు ధవారం నాడు హైదరాబాద్‌లోని ఖాసిం బౌలి, పంచవటీ కాలనీ, పంజాగుట్ట, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్‌లోని ట్రూగ్రేడర్ సర్వీసెస్, అల్వాల్‌లో ని వెంకటపురం ప్రాంతాలతో పాటు ఎపిలోని గుంటూరు జిల్లా చినకాకానిలోని హైలాండ్ ఆవసా రిసార్ట్స్, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఏ కకాలంలో తనిఖీలు చేబట్టారు. దాడుల సందర్భంగా కొంత నగదుతో పాటు పెద్ద ఎత్తున పత్రాలను జప్తు చేసినట్లు తెలిసింది. ఈ కేసులో ఈ డీ అధికారులు త్వరలో కొందరిని అరెస్టు చేయవచ్చని తెలుస్తోంది.

మురసు తుఫానుతో కెఆర్ఎంబి సమావేశం వాయిదా

హైదరాబాద్, నవంబరు 4,ప్రభాతవార్త: నీళ్ల పంపకం, నిధుల కేటాయింపు అంశంగా గురువారం జరుగాల్సిన 21వ కృష్ణానదియాజమాన్య బోర్డు సమావేశం మురసు తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్ అభ్యర్థన మేరకు వాయిదా వేశారు. కెఆర్ఎంబి ఆర్థిక సంవత్సరాలు రెండు గడిచినా అరకొర నిధులతో కెఆర్ఎంబి ఇబ్బందులు పడుతోంది. 2025-26ఆర్థిక సంవత్సరం రూ.23.314 కోట్ల బడ్జెట్ కెఆర్ఎంబి ప్రతిపాదించి ఇరు రాష్ట్రాలు సమానంగా నిధులు సమకూర్చాలని నిర్దేశించుకొన్నప్పటికి తెలంగాణ ప్రభుత్వం 291లక్షల రూపాయలు మాత్రమే ఇచ్చింది. 2026-27 ఆర్థిక సంతవ్సరం 23కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించగా ఆంధ్రప్రదేశ్ 226 లక్షల రూపాయలు మాత్రమే విడుదలచేసింది. తెలంగాణ శ్రీశైలం నుంచి జలవిద్యుత్ ఉత్పాదన చేసి 106 టిఎంసిలు దుర్వినియోగం చేసిందని ఆంధ్రప్రదేవ్ ఆరోపణ చేసిన అంశం కూడా ఎజెడాలో చేర్చారు.

భూమిపై కూలనున్న నాసా భారీ టెలిస్కోపు

భారత్‌లోనే కూలిపోయే అవకాశాలు



న్యూయార్క్, నవంబరు 4: అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటర్బీ స్పేస్ టెలిస్కోప్ భూమివైపు దూసుకొస్తోంది. సుమారు 1500 కిలోల బరువున్న ఈ అంతరిక్ష టెలిస్కోప్ భూ వాతావరణంలోకి ప్రవేశించి కూలిపోనుంది. ఇలా కూలేటప్పుడు చాలా భాగాలు భూ వాతావరణంలోని ఘర్షణ కారణంగా కాలిబూడిద అవుతాయి. అయితే, కొన్ని భారమైన శకలాలు మాత్రం భూమిపై పడే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, ఈ శాటిలైట్ టెలిస్కోప్ కూలిపోయే క్రాష్ జోన్ పరిధిలో భారత్ కూడా ఉంది. ముంబై, హైదరాబాద్, బెంగళూర్, చెన్నై వంటి నగాలు ఈ పరిధిలో ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. నాసా అంచనాల ప్రకారం, అమెరికా తూర్పు కాలమాన ప్రకారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు) ఈ టెలిస్కోప్ భూ వాతావరణంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. నాసా మిషన్ చీఫ్ సైంటిస్ట్ బ్రాడ్ సెంకో మాట్లాడుతూ.. ఆఫ్రికా, ఆస్ట్రేలియా, భారత్, ఆగ్నేయాసియా, మధ్య, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాలు ఈ టెలిస్కోప్ తిరిగి రీఎంట్రీ పరిధిలో ఉన్నాయని తెలిపారు.

45 దేశాల్లో ఆహార సంక్షోభం

వచ్చే యేడాది చివరికి 27.4 కోట్ల మందికి ఆహార సమస్య

ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార పథక విభాగం హెచ్చరిక

న్యూఢిల్లీ, నవంబరు 24: పసిఫిక్ మహాసముద్రం నుంచి పుట్టుకొచ్చిన ఈ శతాబ్దపు అత్యంత శక్తివంతమైన సూపర్ ఎల్‌నినో భారత్‌లో మూడు రకాల విపత్తులను సృష్టించే అవకాశం ఉంది. రుతుపవనాల గతి దెబ్బతినడం, శీతాకాలంలో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవ్వడం, దేశ ఆహార సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం వంటి ముప్పులు ఎల్‌నినో వల్ల దేశంలో ఏర్పడనున్నాయి. మరోవైపు, ఈ ఎల్‌నినో పరిస్థితులు 2027 చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 27.4 కోట్ల మందికి ఆహార సంక్షోభాన్ని కలిగించవచ్చని ఐక్యరాజ్యసమితికి చెందిన వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ హెచ్చరించింది. 45 దేశాల ప్రజలు తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటారని అంచనా వేసింది. మొదటిది ఈ ఏడాది దేశంలో రుతుపవనాల వ్యవస్థను ఎల్‌నినో తీవ్రంగా దెబ్బకొట్టింది. సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో అనేక ప్రాంతాల్లో కరవు పరిస్థితులు వచ్చాయి. రెండోది సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో భారత్‌లో తీవ్రమైన చలి ఉంటుంది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఈ శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పెరిగి చలికాలంలో వేసవి అనుభూతి కలుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. శీతాకాలంలో కూడా ఫ్యాన్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

3,800 యేళ్లనాటి రహస్య లేఖను చదివిన ఆర్కియాలజీ నిపుణులు

అంకారా, నవంబరు 4: పురావస్తు శాస్త్రంలో పరిశోధకులు ఓ అద్భుత విజయాన్ని సాధిం చారు. దాదాపు 3,800 ఏళ్ల క్రితం మట్టితో చేసిన కవర్‌లో పెట్టి సీల్ చేసిన ఓ లేఖను, ఆ కవర్‌ను ఏమాత్రం పగలగొట్టకుండానే విజయవంతంగా చదివారు. అత్యాధునిక ఎక్స్‌రే స్కానింగ్ టెక్నాలజీ సహాయంతో ఈ ఘనతను సాధించారు. ఈ లేఖలో అప్పుగా తీసుకున్న డబ్బును తిరిగి చెల్లించని ఓ వ్యక్తిపై ఓ మహిళ తన భర్తకు ఫిర్యాదు చేసిన ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఆవిష్కరణ చరిత్ర అధ్యయనంలో కొత్త అవకాశాలకు తలుపులు తెరిచింది. ప్రస్తుత తుర్కియేలోని పురాతన అనటోలియా ప్రాంతంలో ఉన్న కుల్తెపె వద్ద జరిపిన తవ్వకాల్లో ఈ మట్టి ఫలకం లభించింది. ప్రస్తుతం దీనిని అంకారాలోని అనటోలియన్ నాగరికతల మ్యూజియంలో భద్రపరిచారు. క్యూనిఫామ్ లిపిలో ఉన్న ఈ లేఖను అన్నాఅన్నా అనే మహిళ, వ్యాపార నిమిత్తం దూర ప్రాంతంలో ఉన్న తన భర్త ఎన్నమ్‌అషూర్‌కు రాసింది. తన భర్త ఆదేశాల మేరకు, లఖేపమ్ అనే వ్యక్తి నుంచి రావలసిన వెండిని అడిగేందుకు అన్నాఅన్నా వెళ్లింది. ఆ అప్పును ఆమెకు చెల్లించడానికి లఖేపమ్ నిరాకరించాడు. నేను నీ భర్త తిరిగి వచ్చాక, నేరుగా అతనికే చెల్లిస్తానని స్పష్టం చేశాడు. తాను ఆ డబ్బును ఇప్పటికే వేరొకరికి ఇచ్చేశానని కూడా వాదించాడు. ఈ మోసాన్ని, అవమానాన్ని వివరిస్తూ అన్నాఅన్నా తన భర్తకు ఆ లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది. వేల ఏళ్లుగా మూసి ఉన్న ఈ మట్టి కవర్‌ను పాడుచేయకుండా లోపలి సమాచారాన్ని తెలుసుకునేందుకు, హంబర్గ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు అభివృద్ధి చేసిన ఈఎన్‌సిఐ అనే ప్రత్యేకమైన పోర్టబుల్ ఎక్స్‌రే కంప్యూటెడ్ టోమోగ్రఫీ స్కానర్‌ను ఉపయోగించారు. ఈ పరికరంతో కవర్‌ను స్కాన్ చేసి, లోపల ఉన్న అక్షరాలను డిజిటల్‌గా పునర్నిర్మించారు. ఈ సాంకేతికత వల్ల పురావస్తు కళాఖండాలను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందిస్తూనే, వాటిలోని రహస్యాలను ఛేదించడం సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ విజయం, ప్రాచీన కాలం నాటి ప్రజల సాధారణ జీవితాలు, వారి ఆర్థిక లావాదేవీలు, సామాజిక సంబంధాలను అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.



ప్రయాణికురాలి నిర్వాకం.. ఓ నిండు ప్రాణం బలి

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మణుగూరు డిపో మహిళా కండక్టర్ ప్రవళిక మృతి

ఆర్టీసీ డిపో బంద్, పట్టణంలో నిరసన ర్యాలీలు.. ప్రవళికకు కన్నీటి వీడ్కోలు

మణుగూరు, నవంబరు 4 ప్రభాతవార్త: చిల్లర విషయంలో ఒక ప్రయా ణికురాలితో జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన మణుగూరు డిపో మహిళా కండక్టర్ జి.ప్రవళిక (24) మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ డిపో నుండి భద్రాచలంకు బస్సు సర్వీసులో విధులు నిర్వహిస్తూ వెళ్తుండగా మార్గం మధ్యలో చక్రాల కింద పడి తీవ్రంగా గాయ పడ్డారు. కుటుంబసభ్యులు, అధికారులు వెంటనే ఆమెను హైదరాబాద్‌లోని సాయి సంజీవిని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో ఆమె కన్నుమూశారు.



ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ వద్ద మృతురాలు మహిళా కండక్టర్ ప్రవళిక తల్లిని పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

గతంలో ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేస్తూ తండ్రి నాగరాజు మరణించడంతో, ఆ వారసత్వ ఉద్యోగంలో పది నెలల క్రితమే ప్రవళిక కండక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మరో రెండు మూడు నెలల్లో ఆమెకు వివాహం చేసేందుకు తల్లి ఏర్పాట్లు చేస్తుండగా ఈ దారుణం చోటుచేసుకుంది. ప్రవళిక మృతికి సంతాపంగా బుధవారం ఆర్టీసీ కార్మిక సంఘాల పిలుపు మేరకు మణుగూరు డిపో బంద్ నిర్వహించారు. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయింది. డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. జోహార్ ప్రవళిక అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీపావళి పండుగ వేళ మా జీవితాల్లో చీకటి నిండింది అని కార్మిక నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

పరిస్థితిని సమీక్షి ంచేందుకు మణుగూరు డీఎస్పీ వి.రవీంద్రారెడ్డి, సీఐ పాటి నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్ డిపోను సందర్శించి భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన మహిళను ఇప్పటికే అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని, ఇదివరకు నమోదు చేసిన కేసును ఇప్పుడు హత్య కేసుగా మార్చి కఠినచర్యలు తీసుకుం టామని తెలిపారు. కండక్టర్ ప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రదిగ్భ్రాంతి, విచారాన్ని వ్యక్తం చేశారు. బాధితురాలి కుటుం బానికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరా బాద్‌లో

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి, ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

- అండర్సన్

విద్యార్థుల భవితకు 'బడి' బాటకావాలి!

విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలలోని పాఠాలను బోధించడం మాత్రమే కాదు. విద్యార్థులను మంచి పౌరులుగా, బాధ్యతాయుతమైన వ్యక్తులుగా, సమాజానికి ఉపయోగపడే మనుషులుగా తీర్చిదిద్దడం కూడా విద్యలో అంతర్భాగం. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను గమనించాలి. వారి సమస్యలను వినాలి. అవసరమైనప్పుడు కౌన్సెలింగ్ అందించాలి. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసే వాతావరణాన్ని పాఠశాలల్లో కల్పించాలి. అదే సమయంలో పాఠశాలల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత బాధ్యత తీసుకోవాలి. పాఠశాలల్లోకి వచ్చేబయటి వ్యక్తుల వివరాలు నమోదుచేయాలి. అనుమతి లేకుండా ఎవరూ తరగతి గదుల్లోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలి. అవసరమైన చోట సీసీకెమెరాలు, ప్రవేశ నియం త్రణ, భద్రతా సిబ్బంది, అత్యవసర సమాచార వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. విద్యాశాఖ, పోలీసు శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. బాలికలపై వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి బాధితులకు రక్షణ కల్పించాలి.

తరిగోపుల నారాయణస్వామి

పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన దేవాలయాలు. విద్యార్థులు పుస్తకాల జ్ఞానంతో పాటు జీవితానికి అవసరమైన మానవీయ విలువలు, క్రమ శిక్షణ, సామాజిక బాధ్యతలను నేర్చుకోవాల్సిన ప్రదేశాలు. అలాంటి విద్యాలయాల్లోనే విద్యార్థులకు రక్షణలేకుండాపోతే వారి భవిష్యత్తుకు భరోసా ఎక్కడ ఉంటుంది? అనంతపురం జిల్లా రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన దారుణ ఘటన యావత్ సమాజాన్ని ఆలోచింపజేస్తోంది. ఒక యువకుడు పాఠశాల తరగతి గదిలోకి ప్రవేశించి విద్యార్థినిపై దాడికి పాల్పడటం మన విద్యావ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, సామాజిక బాధ్యతలపై అనేక ప్రశ్నలను సంధిస్తోంది. ఈ ఘటనను కేవలం ఒక నేరంగా మాత్రమే చూడకూడదు. ఇలాంటి పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి? పిల్లల పెంపకంలో ఎక్కడ లోపాలు జరుగుతున్నాయి? విద్య అంటే కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడమేనా? పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎంత సమయం గడుపుతున్నారు? అనే అంశాలను సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాలి. ముఖ్యంగా తల్లిదండ్రుల బాధ్యత గురించి ప్రత్యేకంగా చర్చించుకోవాలి. పిల్లలకు మంచి పాఠశాలలో చదువు చెప్పించడం, మంచి దుస్తులు కొనివ్వడం, అవసరమైన సౌకర్యాలు కల్పించడం మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత కాదు. పిల్లలతో ప్రేమగా మాట్లాడటం, వారి మనసులోని భావాలను తెలుసుకోవడం, వారి సమస్యలను వినడం, వారికి ఆత్మీయతను అందించడం కూడా అంతే ముఖ్యమైనవి. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది తల్లిదండ్రులు ఉద్యోగాలు, వ్యాపారాలు, ఆర్థిక అవసరాలమధ్య పిల్లలతో గడిపే సమయాన్ని తగ్గించుకుంటున్నారు. పిల్లలకు కావలసిన వస్తువులను అందిస్తున్నారు కానీ వారికి అవసరమైన ఆప్యాయత, అనుబంధం, మార్గదర్శకత్వాన్ని అందించడంలో కొన్నిసార్లు వెనుకబడుతున్నారు. పిల్లలు ఏవయస్సులో ఉన్నా తల్లిదండ్రుల ప్రేమ, ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అవసరం. ముఖ్యంగా కౌమార దశలో వారి ఆలోచనల్లో, ప్రవర్తనలో, భావోద్వేగాల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. ఈసమయంలో పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. వారి స్నేహితులు ఎవరు? వారి ఆసక్తులు ఏమిటి? వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి? అనే విషయాలను తెలుసుకోవాలి. పిల్లలపై కేవలం చదువు ఒత్తిడి పెంచకుండా, జీవితంలో ఎదురయ్యే విజయాలు,



ఒత్తిడి పెంచడంకంటే సమతుల్యమైన విద్యావిధానం అవసరం. ప్రభుత్వం పదోతరగతి విద్యార్థులకోసంప్రత్యేకభోధన, ప్రత్యేకభోజనం, అదనపు విద్యా సహాయం వంటి కార్యక్రమాలను అమలుచేస్తున్నప్పుడు వారిమానసిక ఆరోగ్యం, కుటుంబ అనుబంధం, విశ్రాంతి సమయాన్ని కూడా పరిగణనలోకితీసుకోవాలి. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిరంతరం పాఠశాలలోనేగడిపే పరిస్థితి కాకుండా, విద్యార్థులు తల్లిదండ్రులతో,కుటుంబ సభ్యులతో సమయం గడిపేందుకు తగినఅవకాశం కల్పించాలి. పాఠశాలలో ఉపాధ్యా యులు బోధించేవిలువలను ఇంట్లో తల్లిదండ్రులుఆచరణలో చూపాలి. పిల్లలుపెద్దలను గౌరవించడం, మహిళలను సమానంగా చూడటం,ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం, ఎదుటివారి స్వేచ్ఛను అంగీకరించడం,కోపాన్ని నియంత్రించుకోవడం,సమస్యలనుచర్చలద్వారా పరిష్కరించుకోవడం వంటివిలువలను నేర్చుకోవాలి. ప్రేమ పేరుతో వేధించడం,తిరస్కరణను అవమానంగా భావించడం, ఇతరులపై ఆధిపత్యం ప్రదర్శించడం వంటి ధోరణులు తప్పని చిన్నతనంనుంచే అవగాహన కల్పించాలి. ఇక సమాజం కూడా పిల్లల వ్యక్తిత్వవికాసానికి తోడ్పడాలి.విద్యార్థులు కేవలం పాఠశాలలు, ఇళ్లు,ప్రైవేటు ట్యూషన్లమధ్య మాత్రమే జీవించకూడదు.గ్రామాల్లో జరిగే సామాజిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ,స్వచ్ఛత, గ్రంథాలయ కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి.వృద్ధులకు సహాయం చేయడం, పేదలకు తోడ్పడటం,మొక్కలు నాటడం,గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావడంవంటి కార్యక్రమాలు వారిలో సేవాభావాన్ని,సమానత్వ భావనను,సమాజంపట్ల బాధ్యతను పెంపొంది స్తాయి.తద్వారా వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితంకాకుండా సమసమాజ హితాన్ని కోరే ఆలోచనా విధానం అలవడుతుంది.ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్, సినిమాలు, ఇతర డిజిటల్ వేదికలు యువత ఆలోచనలపై ప్రభావం చూపుతున్నాయి.వాటిని పూర్తిగా నిషేధించడం పరిష్కారంకాదు. వాటిని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవడం నేర్పాలి. హింసను ప్రోత్సహించే ధోరణులకు, మహిళలనుకించపరిచే భావజాలానికి,ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించని ప్రవర్తనకుదూరంగా ఉండేలా అవగాహన కల్పించాలి.యువతలో మానవీయ విలువలు,సహనం,పరస్పర గౌరవం పెంపొందించాలి. విద్యఅనేది కేవలం పాఠ్యపుస్తకాలలోని పాఠాలను బోధించడం మాత్రమేకాదు. విద్యార్థులను మంచిపౌరులుగా, బాధ్యతాయుతమైన వ్యక్తులుగా, సమాజానికి ఉపయోగపడే మనుషులుగా తీర్చిదిద్దడంకూడా విద్యలో అంతర్భాగం.ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను గమనించాలి.వారి సమస్యలను వినాలి. అవసరమైనప్పుడు కౌన్సెలింగ్ అందించాలి. విద్యార్థులు తమసమస్య లను నిర్భయంగా తెలియజేసే వాతావరణాన్ని పాఠశాలల్లో కల్పించాలి. అదేసమయంలో పాఠశాలల భద్రతవిషయంలో ప్రభుత్వం మరింత బాధ్యత తీసుకోవాలి. పాఠశాలల్లోకి వచ్చేబయటి వ్యక్తుల వివరాలు నమోదుచేయాలి.అనుమతి లేకుండా ఎవరూ తరగతి గదుల్లోకి ప్రవేశించకుండా చర్యలుతీసుకోవాలి. అవసరమైనచోట సీసీకెమెరాలు,ప్రవేశ నియంత్రణ, భద్రతా సిబ్బంది, అత్యవసర సమాచార వ్యవస్థలు ఏర్పాటుచేయాలి.విద్యాశాఖ, పోలీసుశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలుసమన్వయంతో పనిచేయాలి. వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి బాధితులకు రక్షణ కల్పించాలి. ●

పోషణ కొరవడుతున్న భారతం!

ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టి కాహార లోపం నుండి గట్టెక్కించలేకపోతున్నారు. స్వాతంత్ర్యానంతరం ఆనాటి పెద్దలు పౌష్టికాహారం విషయంలో తీసుకోవా ల్సిన జాగ్రత్తల గూర్చి పదేపదే వక్కాణించారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవైఐదు శాతంపైగా భారతావనిలోనే ఉన్నారనిఐక్యరాజ్య సమితి నివేదికలు ఏనాటి నుంచో చెబుతున్నాయి. ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో దాదాపు నలభైశాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో ఆరేడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని ఎన్నో నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టిన వారు ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అందు కోసం ఇప్పుడు కొత్తగా దేశంలో నూతన పథకాలు ప్రవేశపెట్టకపోతే పోయారు. ఉన్న పథకాలు ఏమేరకు అమలు చేస్తున్నారో అర్హులైనవారిలో ఎంతమందికి అందిస్తున్నారో అధ్యయనం చేయడమేకాదు పటిష్టమైన పర్యవేక్షణ అవసరం. కేవలం ఈ పర్యవేక్షణాలోపం కారణంగా తల్లీబిడ్డలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగుచూసినా నిర్దిష్టమైన చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషకాహార సమస్య అధికంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిలో మూడోవంతు భారత్‌లోనే ఉన్నారని గతంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అయితే పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు భారత్‌లో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం అందించేందుకు ఆనాటి కేంద్రప్రభుత్వం సమీకృత శిశు అభివృద్ధి పథకాన్ని (ఐసిడిఎ) ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం ఇప్పుడు తాజాగా పిల్లలకు ఉదయం పోషకాలతో కూడిన అల్పాహారం అందించే కార్యక్రమం ఆరంభమైంది. మరొక పక్క బీదాబిక్కి, పెద్దచిన్న అనే తేడా లేకుండా నగరాలు, పట్ట ణాల్లో సబ్సిడీపై మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. పాఠశాలల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు పిల్లలకు కోడిగుడ్లు కూడా సరఫరా చేస్తున్నారు. ఇలా ఎన్నో రకాలుగా ప్రభుత్వపరంగా ఈ సమస్యను అధిగమించేందుకు కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. అయినా భారత్‌లో పౌష్టికాహారం ఎందరినో పట్టి పీడిస్తున్నది. ప్రపంచ ఆకలి సూచీలో నూటఇరవై ఒక్క దేశాల్లో నూట ఏడో స్థానంలో భారత్ ఉన్నట్లు గతంలో ఎన్నో సర్వేలు వెల్లడించాయి. ఈ పౌష్టికాహార లోపం కారణంగా ఆరోగ్యపరంగా ముఖ్యంగా మహిళలలో, చిన్నారుల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపు ముప్పైశాతానికిపైగా వయసుకు తగిన ఎత్తుకు పెరగడంలేదు. మరోపంతొమ్మిది శాతం ఎత్తుకు తగిన బరువు ఉండడం లేదు. ఇంకొక ముప్పైరెండు శాతం పిల్లలు ఎదుగుదల లోపాలను ఎదుర్కొంటున్నారు.మహారాష్ట్ర, జార్ఖండ్, మధ్యప్రదేశ్, అసోం, తదితర రాష్ట్రాల్లో ఈపోషకాల సమస్యలు అధికంగా ఉన్నట్లు సమాచారం. ఇంకొకవైపు పదిహేనేళ్ల బాలికల నుండి యాభైఏళ్లలోపు ఉన్న మహిళల్లో దాదాపు యాభైఏడు శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎనభై శాతానికిపైగా సూక్ష్మ పోషకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం అటు ఆయా రాష్ట్రప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా కొనసా గుతున్నది. రోజురోజుకు పెరుగుతున్న పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు రకరకాల పథకాలతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ముందుకు వెళుతున్నాయి. పథకాలు, ఉద్దేశ్యాలు అన్నిసక్రమంగా ఉన్నా సంతృప్తికలిగించే విధంగా కాగితాల్లో కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి మాటలకే పరిమితమవుతున్నాయి. దళారుల ప్రమేయం పెరిగిపోతున్నదనే వాదనలకు జరుగుతున్న సంఘటనలు బలం చేకూరుస్తున్నాయి. వాస్తవంగా ఈసారి ఖరీఫ్‌లో ఎల్‌నినో ప్రభావం తప్ప దాదాపు గత పది సంవత్సరాలుగా ఆహార ధాన్యాల ఉత్పత్తుల కొరత లేదు. రికార్డుస్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఇలా ఆహారోత్పత్తులు భారీగా పెరుగుతున్నా లక్షలాది టన్నుల ఆహారధాన్యం నిల్వలున్నా అందరికి రెండు పూటలు ఆకలి తీర్చుకునేందుకు తిండిగింజలు అందించలేకపోతున్నారు. ఇప్పటికీ భారత్‌లో అర్థాకలితో కాలం గడిపేవారు కోట్ల సంఖ్యలో ఉన్నారు. మరొకపక్క పాఠశాలల్లో కనీస పారి శుధ్య సౌకర్యాలు లేకపోవడం వల్ల అవి అంటువ్యాధుల కేంద్రాలుగా మారుతున్నాయి. మరుగు దొడ్లు లేకపోవడం, కనీస పరిశుభ్రత పాటించక పోవడంతో అనారోగ్యసమస్యలు పెరుగుతున్నాయి. ఇక సమగ్రశిశు అభివృద్ధి పథకం కింద మాతాశిశు సంరక్షణ కోసం పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని ఏనాటి నుంచో 'కాగ్' పెచ్చరిస్తూనే ఉంది. కానీ వాటిని పట్టించుకునేవారే లేకుండాపోతున్నారు. ఇప్పుడు తాజాగా ఎల్‌నినో కారణంగా పంటల ఉత్పత్తులు గణనీయంగా తగ్గిపోయే అవకాశాలున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికే ఆకాశాన్ని అంటుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా బియ్యం కిలో వందరూపాయలకు పెరిగిపోయిం ది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పథకాల గురించి ఆలోచిం చకపోయినా ప్రస్తుతం ఉన్న పథకాల్లోనే లోపాలను సవరించి పర్యవేక్షణ పెంచితే కొంతమేరకైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

> నీతిగా జీవించడమంటే మనం మన మనసు మీద కోర్కెల మీద అధికారం సంపాదించాలి.
>
> 
>
> మహాత్మా గాంధీ

> ఇతరులకు సంతోషాన్ని కలిగించకుండా సంతోషాన్ని పొందే అధికారం, ధనాన్ని ఉత్పత్తి చేయకుండా ధనాన్ని వాడుకునే అధికారం మనకు లేవు.
>
> 
>
> జార్జి బెర్నార్డ్ షా

ప్రజావాక్కు



పూడ్చలేని నష్టం

అర్నబ్ తుఫాను కోస్తా జిల్లాలను అనేక రకాలుగా నష్టాలను కలుగజేసింది. ఆ ప్రాంత వాసులు కోలుకోవడానికి ఏళ్ల పట్టవచ్చు.కొబ్బరి చెట్లు,వంటలు నాశనమై పోయాయి. మరల మరో మురిసి అనే ఇంకో తుఫాను ముంచుకొచ్చి ఈసారి జీవితాలను, జీవనాధార సామాగ్రిని సర్వనాశనం చేసింది. వారి రోదనలు వర్ణనాతీతం. ఇళ్ల తలుపులుగాలికి పగిలిఇంట్లో ఉన్నటి.వి.లు కిందపడి పగిలిపోయాయి. కొబ్బరి చెట్లు వాటర్ ట్యాంకుల మీద పడి అవి కూలిపోయాయి. నీళ్ళు,పాలు రెండు రోజుల పాటు ఊళ్ళల్లో దొరకలేదు.విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి కరెంటు లేక ఫోన్లుపనిచేయక కమ్యూనికేషన్ వ్యవస్థ బాగా దెబ్బతింది. రాష్ట్ర ప్రభుత్వం నడుం కట్టుకుని సహాయ కార్యక్రమాలు చేపట్టినా, జరిగిన నష్టం పూడ్చలేనిది. ప్రభుత్వ సహాయం చేసినా అది కొంతవరకే.

- ఎన్. రామలక్ష్మి, కోనసీమ జిల్లా

మన బాధ్యత

మెట్రోరైలుమన ప్రయాణాన్ని సులభంగా,వేగంగా చేస్తోంది. అయితే కొందరు తలుపుల పక్కనే నిలబడి ఉండటం వల్లరైలులోకిఎక్కేవారికి,దిగేవారికిఇబ్బంది కలుగుతోంది. రైలులోతలుపుల దగ్గరనిలబడవద్దని పదేపదే ప్రకటనలు వస్తున్నా, కొందరు వాటిని పట్టించుకోకుండా అక్కడే నిలబడుతున్నారు. దయచేసి తలుపులపక్కన నిలబడకుండా కొంచెం లోపలికి వెళ్లి నిలబడండి. ముఖ్యంగా రద్దీ సమయంలోతలుపుల దగ్గరఖాళీగా ఉంచడంచాలా అవసరం. లేకపోతే దిగాల్సిన స్టేషన్ వచ్చినప్పుడు ఇతరులు సులభంగా బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. మనం కొంచెం వెనక్కి జరిగి నిలబడితే ఎక్కేవారికి, దిగేవారికి సౌకర్యంగా ఉంటుంది. ముందుగాదిగేవారికి దారి ఇచ్చి, తరువాత ఎక్కడం అందరికీ మంచి పద్ధతి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

అవినీతి అనకొండలు

అవినీతి అనకొండలు పట్టుబడిన కొద్దీ ఇంకా ఇంకా పట్టుబడుతూనేఉన్నాయి.అలాగేదొంగతనాలు, దోపిడీలు, సైబర్ నేరాలు, మానభంగాలు, భార్యలు, భర్తలు ఒకరినొకరుచంపుకోడాలు విచ్చలవిడిగాజరుగుతున్నాయి. కారణం పాపభీతి కరువవుతోంది.కష్టపడకుండా డబ్బు సంపాదనకు అలవాటు పడుతున్నారు. బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదు.

-పి. మూర్తి, సికింద్రాబాద్

స్వావలంబనకు కొత్త బాట

వందశాతం ఇథనాల్‌తో నడిచే ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించడం భారత ఇంధన రంగంలో కీలక పరిణామం.పెట్రోలియం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. దేశ ముడిచమురు అవసరాల్లో దాదాపు 87శాతం దిగుమతుల ద్వారానే సమకూరుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధనాలఅభివృద్ధి అత్యంతఅవసరం. బ్రెజిల్‌లో కొత్తగా విక్రయమయ్యే తేలికపాటి వాహనాల్లో 80 శాతానికి పైగా ఫ్లెక్స్‌ఫ్యూయల్ సాంకేతికతను వినియోగిస్తున్నాయి.ఆఅనుభవాన్ని భారతదేశం సద్వినియోగం చేసుకోవచ్చు. చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి ఇథనాల్ ఉత్పత్తి పెరిగితే రైతులకు అదనపు ఆదాయావకాశాలు లభిస్తాయి. అయితే వినియోగదారుల ప్రయోజనాలను విస్మరించరాదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

పెరుగుతున్న నిరుద్యోగులు

రెండువేల నలభైఏడు నాటికి భారతదేశాన్ని వికసిత దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం ఎంత గొప్పదైనా, దాని విజయాన్ని కేవలం జీడీపీ గణాంకాలు లేదా మౌలిక వసతుల ఆధారంగా కొలవలేం.భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్దయువ జనాభా కలిగిన దేశం. జనాభాలో సుమారు 65శాతం మంది 35 ఏళ్లలోపువారే.ఈ యువశక్తినిసరైన దిశలో వినియోగించగలిగితేఅదిఅభివృద్ధికి బలమైన ఇంధనంగా మారుతుంది. అయితే యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతే ఇదే జనాభా వరంభారంగా మారేప్రమాదం ఉంది.ఇటీవలి గణాంకాల ప్రకారం యువ నిరుద్యోగిత రేటు కొంత తగ్గినప్పటికీ, ప్రతి సంవత్సరం ఉద్యోగ విపణిలోకి అడుగుపెడుతున్న లక్షలాది యువత అవసరాలకు సరిపడా అవకాశాలు ఇంకా సృష్టించబడటం లేదు.

- కె.నాగరాజు, హైదరాబాద్

నిబంధనలను రద్దు చేయాలి

కొన్ని సందర్భాలలోవికలాంగుల ఉద్యోగులఎఫ్‌ఆర్ఎస్ యాప్‌లో హాజరు నమోదు కావడంలేదు. ఆల్బయినిజం అంధులు, దృష్టి లోపం కలిగిన అంధులు చాలాఇబ్బంది పడుతున్నారు. తోటి స్టాఫ్ సహాయం చేయడంలో విసుగు పడుతున్నారు. స్టాఫ్ రిజిస్టర్‌లో సంతకాన్ని ప్రామాణికంగా చేయాలి. వీరి హాజరు నిబంధనలు రద్దుచేయాలి.వీరికి 2016 వికలాంగుల హక్కుల చట్టంప్రకారం న్యాయం చేయాలి. ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి కూడా ఆదేశాలు జారీ చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గ్రామాభివృద్ధి లక్ష్యంతో ఏకగ్రీవ ఎన్నికలకు ప్రోత్సాహం



అన్నవరపు బ్రహ్మయ్య

స్థానిక సంస్థల ఎన్నికలలో ఏకగ్రీవ ఎన్నికలు ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిస్తున్నాయంటూ ప్రస్తుతం జరిగిన ఏకగ్రీవ ఎన్నికలపై లేనిపోని కొంతమంది నాయకులు, విశ్లేషకులు యాగీ చేస్తున్నారు. నిజానికి స్థానికసంస్థల ఎన్నికలలో ముఖ్యంగా గ్రామ పంచాయతీలలో ఏకగ్రీవాలు జరగడం కొత్తేమి కాదు. భారత రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలది. నిజానికి స్థానిక సంస్థలకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరగడం కొత్తకాదు. 1960వ సంవత్సరం నుంచి ఏకగ్రీవాలు జరగడమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌తోపాటు హర్యానా, గుజరాత్ వంటి పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఏకగ్రీవాలు చేసుకొన్న స్థానికసంస్థలకు ఆర్థిక ప్రోత్సాహాలను కూడా ప్రకటించాయి. గ్రామ పంచాయతీలు లేదా పురపాలక సంఘాలు స్థానిక పరిపాలనా సంస్థలుమాత్రమే ఇక్కడ చట్టాలు రూపొందవు. గ్రామాల అభివృద్ధి విషయంలో గ్రామంలో ప్రజల మధ్య వైషమ్యాలు వుండకూడదనే లక్ష్యంలో గ్రామస్థులందరినీ ఏకతాటిపై నిలపాలనే ఉన్నత లక్ష్యంతో ఏకగ్రీవ ఎన్నికలను ప్రోత్సహించడం ప్రారంభిం చారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విషయానికివస్తే 1960లో తొలిగా ఏకగ్రీవంగాపంచాయతీ సర్పంచు ఎన్నిక చేసుకొంటే ఆ గ్రామానికి జనాభాను బట్టి ప్రోత్సాహకంగా 2,500నుంచి 5,000 వేలరూపాయలకు ఇవ్వడం ప్రారంభించారు. ఆ ప్రోత్సాహ బహుమతి క్రమంగా 5నుంచి 20లక్షలకు చేరింది. అంతెందుకు గత ప్రభుత్వం కూడా ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు ఆయా పంచాయతీల జనాభాను బట్టి 5నుంచి 20లక్షల రూపాయల వరకు నగదు ప్రోత్సాహాలను ప్రకటించింది. కానీ చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోనే ఏకగ్రీవాలు జరుగుతున్నట్టు, ప్రజాస్వామ్యానికి తుట్లుపడుతున్నట్టు మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. 1993, జూన్ 1వ తేదీన జరిగిన 73, 74 రాజ్యాంగ సవరణలకు ముందువరకు ఆయా సంస్థ లకు కేవలం పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగేవి. పరోక్ష పద్ధతి అంటే ఆయా పంచాయతీలలో సర్పంచ్లను ప్రజలు నేరుగాకాకుండా గ్రామంలో ఎన్నికైనవార్డుమెంబర్లు తమలో ఒకరిని సర్పంచ్‌గా ఎన్నుకొంటారు. అదే విధంగా పురపాలక సంఘాలలో అయితే మున్సిపల్ కౌన్సిలర్లు, నగరాలలో కార్పొరేటర్లు నగర మేయరు ఎన్నుకొనేవారు. అయితే రాజ్యాంగ సవరణ తర్వాత ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అభిష్టం మేరకు స్థానిక సంస్థలకు చెందిన సర్పంచ్, చైర్మన్, మేయర్ పదవులకు కావాలంటే ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికల నిర్వహించే అవకాశం కలిగింది. ఈ కారణంగానే మన రాష్ట్రంలో ఒక్కొక్కసారి ఒక్కొక్క విధంగా అంటే ప్రత్యక్షంగా/ పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయి. గత ఎన్నికలలో అంటే 2021వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో అప్పటి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించగా ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తోంది. పరోక్ష ఎన్నికల్లో ఏకగ్రీవాలు చేయడం అంతతేలికైన విషయం కాదు. ఒక గ్రామం లేదా పురపాలక సంఘ పరిధిలో వున్న ప్రతి వార్డులో మెంబరు లేదా కౌన్సిలర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి. అప్పుడు మాత్రమే వారందరూ కలసి తమలో ఒకరిని సర్పంచ/ లేదా చైర్మన్‌గా ఎన్నుకోగలుగుతారు. ఇంతటి క్లిష్ట విధానంలో 2021 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో నాలుగు మున్సిపాలిటీలు అంటే పులివెందుల, పుంగనూరు, పిడుగురాళ్ల, మాచర్లలో కనీసం ప్రతిపక్షం అనేది లేకుండా ఏకగ్రీవంగా కౌన్సిలర్లను, చైర్మన్లను ఎన్నుకొన్నారు. ఆనాడు ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం ఏదో అన్యాయం జరిగిపోయిందంటూ కోర్టులలో కేసులు దాఖలు చేయలేదు. పరోక్ష ఎన్నికలతోపోల్చుకుంటే ప్రత్యక్ష ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరగడం సులభం. ఈ కారణంగానే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 17 మున్సిపాలిటీలలో జరిగిన ఏకగ్రీవాలపై ప్రజాస్వామ్యం ఏమైపోతోందిఅంటూ అల్లాడిపోతున్న కొంతమంది విశ్లేషకులు ఆనాడు ఎవరూ నోరు విప్పలేదు. అంతేకాకుండా నాలుగు దశలలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. మొదటి దశలో 525, రెండో దశలో 539, మూడో దశలో 579, నాలుగో దశలో549 పంచాయతీలలో ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవం కావడం నేరం ఘోరం అనేవారు స్వేచ్ఛగా జరిగితే నామినేషన్లు వేయకుండా వుంటారా? అని సన్నాయి నొక్కులు నొక్కేవారు ఆనాడు మౌనంగా వున్నారు. ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా ఎంఎల్ఎ/ ఎంపి పదవులకు ఏకగ్రీవం జరుగుతాయా? అని కొంతమంది తమ అనుభవాలను కూడా మరచిపోయి వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటివరకు చట్టసభలకు జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే 1952, 1957,1967 లలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఐదేసి మంది సభ్యులు లోక్‌సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప ఎన్నికలను కలుపుకొంటే ఇప్పటివరకు 29మంది ఎంపిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా శాసనసభ్యుల విషయానికి వస్తే ఇప్పటివరకు దేశం మొత్తంగా 298మంది శాసన సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఉమ్మడి ఆంధ

ట్రంప్‌కు షాక్ ఇచ్చిన యువత



వాషింగ్టన్, నవంబరు 4: అమెరికా మధ్యంతర ఎన్నికలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రజాదరణకు ఒక పెద్ద పరీక్షగా మారాయి. ఈ ఎన్నికల్లో తన మద్దతుదారులు స్వయంగా ట్రంపే బరిలో ఉన్నట్లు భావించి ఓటు వేయాలని ఆయన పదే పదే విజ్ఞప్తి చేశారు. అమెరికా ఓటర్లు ట్రంప్ విజ్ఞప్తిని సీరియస్‌గానే తీసుకున్నప్పటికీ, వచ్చిన ఫలితాలు మాత్రం ట్రంప్‌తో పాటు రిపబ్లికన్ పార్టీ అంచనాలను తలకిందులు చేశాయి. మంగళవారం వెలువడిన ఫలితాల్లో డెమోక్రటిక్ పార్టీ పలు కీలక రాష్ట్రాల్లో భారీ విజయాన్ని సాధించింది. జార్జియా, టెక్సాస్, ఒహాయో, మిచిగాన్, నార్త్ కరోలినా, న్యూ హాంప్‌షైర్ వంటి కీలక రాష్ట్రాల్లో రిపబ్లికన్ అభ్యర్థులు ఘోర ఓటమిని మూటగట్టుకున్నారు. ఈ ఎన్నికల ఫలితాలను ట్రంప్ పాలనా విధానాలు, ఆయన నాయకత్వంపై ప్రజల్లో పెల్లుబికిన అసంతృప్తికి నిదర్శనంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్నికలకు ముందే పెరిగిన ద్రవ్యోల్బణం, ఇరాన్‌తో ఉద్రిక్తతలు, ట్రంప్ పడిపోతున్న ప్రజాదరణ రిపబ్లికన్ పార్టీని తీవ్రంగా దెబ్బతీశాయి. దాదాపు 75 శాతం మంది ఓటర్లు దేశం పాలనా విధానంపై తీవ్ర నిరాశతో ఉన్నారు. సుమారు 60 శాతం మంది ట్రంప్ పనితీరును పూర్తిగా వ్యతిరేకించారు. ఈ గాలిని అనుకూలంగా మార్చుకున్న డెమోక్రాట్లు, ఇప్పుడు అమెరికన్ కాంగ్రెస్‌లోని రెండు సభల్లోనూ స్పష్టమైన మెజారిటీ సాధించే దిశగా బలమైన అడుగులు వేశారు. డెమోక్రాట్ల ఈ చారిత్రక విజయం వెనుక ప్రధానంగా యువత, హిస్పానిక్ ఓటర్ల పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు గట్టిగా నిలబడిన ఈ వర్గాలు, ఈసారి డెమోక్రాట్ల వైపు మొగ్గు మాపాయి. నివేదికల ప్రకారం 30 ఏళ్లలోపు ఉన్న యువ ఓటర్లలో దాదాపు 70 శాతం మంది డెమోక్రటిక్ అభ్యర్థులకే పట్టం కట్టారు. 2024లో ఇదే విభాగంలో ట్రంప్, కమలా హ్యారిస్ మధ్య ఓట్ల సమంగా పక్కకు మారగా, ఇప్పుడు డెమోక్రాట్లు స్పష్టమైన పైచేయి సాధించారు. హిస్పానిక్ ఓటర్లలో కూడా రిపబ్లికన్ల పట్ల ఆదరణ తగ్గింది. వారిలో 60 శాతం మంది డెమోక్రాట్లను సమర్థించడమే కాకుండా, ట్రంప్ ఆర్థిక విధానాల వల్లే అమెరికా ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని 70 శాతం మంది అభిప్రాయపడ్డారు. పెన్సిల్వేనియా గవర్నర్ జోష్ షాపిరో, మేరీల్యాండ్ గవర్నర్ వెస్ మూర్‌లు తిరిగి గెలవడం లిబరల్ వర్గానికి బలాన్నిచ్చింది. వీరిద్దరినీ 2028 అధ్యక్ష ఎన్నికల రేసులో ముందంజలో ఉన్న నాయకులుగా చూస్తున్నారు. మొత్తానికి ఈ మిడ్‌టర్మ్ ఫలితాలు ట్రంప్ వైఫల్యాలకు అద్దం పడుతూనే, రాబోయే 2028 పోరుకు స్పష్టమైన రాజకీయ దిశను నిర్దేశిస్తున్నాయి.

వివేక్ రామస్వామిపై డెమొక్రటిక్ అభ్యర్థి విజయం

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు



ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో భారతీయ సంతసికి చెందిన పలువురు అభ్యర్థులు బరిలో నిలవగా, వారి రాజకీయ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. ఫ్లోరిడా నుంచి డెమోక్రటిక్ పార్టీ తరఫున పోటీ చేసిన పియా దండియా ఘన విజయం సాధించి సంచలనం సృష్టించగా, ఓహియో గవర్నర్ బరిలో నిలిచిన వివేక్ రామస్వామికి మాత్రం నిరాశ ఎదురైంది. ఆయనపై డెమోక్రటిక్ అభ్యర్థి ఆమీ ఆక్టన్ విజయం సాధించారు. దశాబ్దాలుగా రిపబ్లికన్ల కంచుకోటలుగా ఉన్న రాష్ట్రాల్లో డెమోక్రాట్లు ఘన విజయం సాధించి వర్జీనియా నుంచి టెక్సాస్ వరకు వీచిన బ్లూ వేవ్‌తో తమ పాగా వేశారు. ముఖ్యంగా టెక్సాస్, కాన్సాస్, ఓహియో వంటి కీలక రాష్ట్రాల్లో డెమోక్రాట్లు తమ హవా చాటారు.

94యేళ్ల తర్వాత కాన్సాస్‌లో డెమొక్రాట్ అభ్యర్థి గెలుపు



కాన్సాస్ యూఎస్ సెనేట్ ఎన్నికల్లో ఊహించని సంచలనం నమోదైంది. దాదాపు 94 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కాన్సాస్ రాష్ట్రం నుంచి ఓ డెమోక్రాట్ నాయకుడు యూఎస్ సెనేట్‌కు ఎన్నికై చరిత్ర సృష్టించారు. ఎన్నికల ఫలితాల్లో డెమోక్రటిక్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ ఘన విజయం సాధించి, డోనాల్డ్ ట్రంప్ మద్దతు తెలిపిన రిపబ్లికన్ అభ్యర్థి రాజర్ మార్షల్‌ను ఓడించారు. ఈ గెలుపు సెనేట్ ఆధిపత్యం కోసం పోరాడుతున్న డెమోక్రటిక్ పార్టీకి భారీ ఊరటనిచ్చింది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ 16 శాతానికి పైగా ఓట్ల మెజారిటీ సాధించిన కాన్సాస్‌లో రిపబ్లికన్లు సునాయాసంగా గెలుస్తారని భావించినప్పటికీ, ఆడమ్ హామిల్టన్ సాధించిన ఈవిజయం అందరినీ ఆశ్చర్యపరిచింది.

మొదటిసారి డెమొక్రటిక్ ముస్లిం సేనేటర్ గెలుపు

అమెరికా రాజకీయ చరిత్రలోనే సరికొత్త అధ్యాయం లిఖించబడింది. డెమోక్రటిక్ పార్టీ తరఫున మిచిగాన్ నుంచి పోటీ చేసిన డాక్టర్ అబ్దుల్ ఎల్‌సయ్యద్(42) అమెరికా సెనేట్ రేసులో ఘనవిజయం సాధించారు. ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి మైక్ రోజర్స్‌ను ఓడించి చడం ద్వారా యూఎస్ సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లిం సభ్యుడిగా ఎల్‌సయ్యద్ చరిత్రాత్మక రికార్డు సృష్టించారు. అత్యంత ఉత్కంఠగా సాగిన ఈ ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఎదురైన వ్యక్తిగత తీవ్ర విమర్శలను సైతం తట్టుకుని ఆయన విజయం సాధించడం గమనార్హం.



అబ్దుల్ ఎల్‌సయ్యద్ విజయంతో కర్ణాటకలోని తీర ప్రాంత పట్టణం భట్కల్, రాజధాని బెంగళూరులో పండుగ వాతావరణం నెలకొంది.

అంతరిక్షం నుంచే ఓటువేసిన వ్యోమగాములు

పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయడం కాదు నాసా ఆస్ట్రోనాట్లు భూమికి సుమారు 400



కిలోమీటర్ల ఎత్తు నుంచి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి తమ ఓటు వేశారు. మైక్రో గ్రావిటీలో ఓటేసిన తీరుపై భారత సంతతి ఆస్ట్రోనాట్ అనిల్ మీనన్ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. మీనన్‌తో పాటు మరో ఇద్దరు అమెరికన్ సిబ్బంది కూడా ఓటింగ్‌లో పాల్గొన్నది. అయితే డిజిటల్ రూపంలో వ్యోమగాములు ఓటేశారు. ఎలక్ట్రానిక్ బ్యాలెట్ ద్వారఓటేసినట్లు మీనన్ తన వీడియోలో తెలిపారు. స్పేస్ స్టేషన్‌లో ఉన్న ల్యాప్ టాప్ ద్వారా ఎలక్ట్రానిక్ ఓటును వినియోగించుకున్నారు.



చెన్నైలో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి

ప్రధాని మోడీకి సిఎం విజయ్ లేఖ

చెన్నై, నవంబరు 4: సుప్రీంకోర్టు ఢిల్లీలో ఉండటం వల్ల దక్షిణాది రాష్ట్రాల నుంచి కక్షిదారులు ప్రతీ సారీ హస్తినకు వెళ్లాల్సి రావడం ఇబ్బందిగా మారిందని సీఎం విజయ్ ప్రధాని మోడీ దృష్టికి తెచ్చారు. కాబట్టి చెన్నైలో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయ్ ప్రధాని మోడీకి ఓ లేఖ రాశారు. ఇది తమిళనాడు యొక్క దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ అని ఇందులో గుర్తు చేశారు. దీన్ని మొదటిసారిగా 1980లో లేవనెత్తారని విజయ్ తన లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్130ను ఈ సం దర్భంగా ప్రధానికి రాసిన లేఖలో విజయ్ ప్రస్తావించారు.

వలసజీవులందరూ వచ్చేయండి: బెంగాల్ సిఎం సువేందు



కోల్‌కత్తా, నవంబరు 4: పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన కార్మికులు తిరిగి రావాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలవుతున్న వీబీ జీ రామ్ జీ పథకం కింద కార్మికులందరికీ 125 రోజుల పాటు కచ్చితంగా ఉపాధి కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పుడు వీబీ జీ రామ్ జీ పథకం అమలవుతోంది. దీని కింద కార్మికులకు కచ్చితంగా ఉపాధి కల్పిస్తాం. కాబట్టి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన కార్మికులంతా తిరిగి బెంగాల్‌కు రండి. సొంత రాష్ట్రంలో పని చేసుకుంటూ కుటుంబంతో కలిసి ఉండండి అంటూ సువేందు అధికారి పేర్కొన్నారు.బుధవారం పంచాయతీ శాఖ సమావేశానికి హాజరైన ఆయన వలస కార్మికుల కోసం ఈ పిలుపునిచ్చారు.

హోటల్ ప్రాపర్టీ ఫైరింగ్‌కేసులో నిందితుడి ఎన్‌కౌంటర్

గువాహతి, నవంబరు 4: అస్సాంలోని గౌహతిలోని ఓ హోటల్ ప్రాపర్టీ విషయంలో జరిగిన ఫైరింగ్ ఘటనలో అయిదుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే ఆ కేసులో ప్రధాన నిందితుడు ఒకరు పోలీసులు చెర నుంచి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో జరిగిన కాల్పుల్లో ప్రధాన నిందితుడు హతమైనట్లు పోలీసులు చెప్పారు. కస్టడీ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిన నిందితుడిని కాల్చినట్లు పోలీసులు వెల్లడించారు. తెల్లవారుజామున 3.10 నిమిషాలకు గౌరిసాగర్ వద్ద ఎన్‌కౌంటర్ జరిగింది. మరో కేసులో శివసాగర్ జిల్లాకు అతన్ని తీసుకువెళ్తున్న క్రమంలో ఈ ఘటన జరిగినట్లు ఎస్పీ పాపోరి చేతియా తెలిపారు.



ఉత్తమ సిఎంగా యోగి ఆదిత్యనాథ్

టాప్‌టెన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు

న్యూఢిల్లీ, నవంబరు 4: దేశవ్యాప్తంగా వేర్వేరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పనితీరుపై నిర్వహించిన సర్వే ఫలితాలు వెల్లడయ్యాయి. వారి పాలనా సమర్థత, పారదర్శకత, నాయకత్వ ప్రతిభ, ప్రజాదరణ ఆధారంగా దీన్ని రూపొందించారు. టాప్ 15 ముఖ్యమంత్రుల ర్యాంకులను విడుదల చేశారు. ఈ బెస్ట్ సీఎం సర్వేను ఫేమ్ ఇండియా మేగజైన్, ఏషియా పోస్ట్ సంయుక్తంగా నిర్వహించాయి. ఆయా ముఖ్యమంత్రుల పనితీరు ఆధారంగా పాయింట్లు, ర్యాంకులు కేటాయించాయి. ఈ సర్వేలో మొత్తం 15 మంది ముఖ్యమంత్రులను ఎంపిక చేశారు. మొదటి 10 మందికి ది బెస్ట్ సీఎం హోదా ఇచ్చారు. చివరి అయిదు స్థానాల్లో వారికి ముఖ్యమంత్రి పంచరత్న అనే గుర్తింపు నిచ్చారు. మొత్తం 1,000 పాయింట్ల ఆధారంగా సాగిన సర్వే ఇది. తొలి మూడు స్థానాల్లో కూడా బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులే ఉండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి ఈ జాబితాలో ఉన్నారు. ఉత్తమ ర్యాంకులతో టాప్ 10లో చోటు దక్కించుకున్నారు. ది బెస్ట్ సీఎం జాబితాలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ టాప్ లో ఉన్నారు. ఆయన పనితీరుకు మొత్తం 897 మార్కులు పడ్డాయి. అత్యుత్తమ ముఖ్యమంత్రిగా ఆయన అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ 881 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచారు.అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ 874 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురూ బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులే. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ 856 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ 844 పాయింట్లతో అయిదో స్థానంలో నిలిచారు. ఏపీ చంద్రబాబు 842 పాయింట్లతో ఆరో ర్యాంకు సాధించారు. సిక్కిం సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ 838 పాయింట్లతో ఏడో స్థానంలో ఉండగా, రేవంత్ రెడ్డి 827 పాయింట్లతో ఎనిమిదో ర్యాంకును దక్కించుకున్నారు. మధ్యప్రదేశ్, మేఘాలయా ముఖ్యమంత్రులు మోహన్ యాదవ్ 803, కాన్రాడ్ సంగ్మా 802 పాయింట్లతో వరుసగా తొమ్మిది, 10 స్థానాల్లో నిలిచారు.ముఖ్యమంత్రి పంచరత్న కేటగిరీ అంటే చివరి అయిదుమందిలో దేవేంద్ర ఫడ్నవీస్ (మహారాష్ట్ర) 788, రేఖా గుప్తా (ఢిల్లీ) 768, ఒమర్ అబ్దుల్లా (జమ్మూకాశ్మీర్) 766, భూపేంద్ర పటేల్ (గుజరాత్) 760, భజన్ లాల్ శర్మ (రాజస్థాన్) 746 ఉన్నారు.ఈ సర్వేను ఏషియా పోస్ట్ సంస్థతో కలిసి ఫేమ్ ఇండియా దాదాపు మూడు నుంచి నాలుగు నెలల పాటు నిర్వహించింది. మూడు దశల్లో సర్వే సాగింది. మొదటి దశలో సోషల్ మీడియా, వార్తల్లో లభించిన ప్రజా స్పందనను విశ్లేషించారు. రెండో దశలో సమాజంలోని వివిధ రకాల మేధావులు, ప్రముఖుల అభిప్రాయాలను సేకరించగా, మూడో దశలో క్షేత్రస్థాయిలో ప్రజలతో నేరుగా మాట్లాడి వారి అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకుని తుది సమాచారాన్ని క్రోడీకరించారు.

100కుపైగా కేసుల్లో లగ్జరీవాచ్‌లు సాక్ష్యాలు మాయం

ఎర్నాకుళం జిల్లాకోర్టు సీరియస్



ఎర్నాకుళం, నవంబరు 4: సుమారు వంద కుపైగా కేసులకు సంబంధించిన లగ్జరీ వాచ్‌లు, ఇతర సాక్ష్యాధారాలు కోర్టు స్ట్రాంగ్ రూమ్ నుంచి మాయ మయ్యాయి. కోర్టు కస్టడీలో ఉన్న విలువైన వస్తువులు కనిపించకపోవడంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు కేరళలోని ఎర్నాకులం జిల్లా కోర్టులో ఈ సంఘటన జరిగింది. ఒక కేసుపై విచారణ ముగిసిన తర్వాత కోర్టు కస్టడీలో ఉన్న రూ. 1.90 లక్షల విలువైన లగ్జరీ రాడో వాచ్‌ను తిరిగి తీసుకునేందుకు ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. కోర్టు అధికారులు ఆ వాచ్ కోసం స్ట్రాంగ్ రూమ్‌లో వెతికారు. అయితే అది కనిపించలేదు. కోర్టు అధికారుల ఆడిట్లో షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. మరో 123 కేసులకు సంబం ధించిన ఖరీదైన వస్తువులు, ఇతర సాక్ష్యాధారాలు కూడా మాయమయ్యాయి. కనివించని కస్టడీలోని వస్తువుల్లో ఎక్కువగా వివిధ బ్రాండ్లకు చెందిన లగ్జరీ, ఖరీదైన వాచీలు ఉన్నాయి. ఈ విషయం బయటపడటంతో జ్యుడీషియల్ కస్టడీలో ఉంచిన సామాన్ల భద్రత, జవాబుదారీతనంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. మరోవైపు కోర్టు జూనియర్ సూపరింటెండెంట్ దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎర్నాకులం పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు కస్టడీలోని విలువైన వాచ్‌లు, సాక్ష్యాధారాలైన ఇతర వస్తువులు ఎలా మాయమయ్యాయి అన్నది దర్యాప్తు చేస్తున్నారు. కోర్టు స్ట్రాంగ్ రూముకు బాధ్యత వహించే ఉద్యోగి, కోర్టు సిబ్బందిని ప్రశ్నించనున్నారు.

'నేను బరిలో ఉంటే వేరేలా ఉండేది': ట్రంప్

వాషింగ్టన్, నవంబరు 4: అమెరికాలో జరిగిన మధ్యంతర (మిడ్ టర్మ్) ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘోరంగా వెనుకబడటంపై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలిసారిగా స్పందించారు. ఒకవేళ ఈ ఎన్నికల్లో తన పేరు కూడా బ్యాలెట్‌లో ఉండి ఉంటే తమ పార్టీ అఖండ విజయం సాధించి ఉండేదని ఆయన అన్నారు. తాను ఎన్నికల బరిలో లేనందునే ఈ ఫలితాలు వచ్చాయని, తానే కనుక ఉంటే భారీ మెజార్టీతో గెలిచేవారమని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు.

మిడ్‌టర్మ్ ఎన్నికలు అంటే ఏమిటి?: అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగిన రెండేళ్ల తర్వాత ఈ మిడ్ టర్మ్ ఎన్నికలు జరుగుతుంటాయి. వీటిలో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, సెనేట్‌లోని మూడింట ఒక వంతు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. పార్లమెంట్‌లోని రెండు సభల్లో ఏ పార్టీకి మెజార్టీ వస్తుందనేది ఈ ఫలితాలే తేలుస్తాయి. ఒకవేళ డెమొక్రాట్లు ప్రతినిధుల సభలో మెజార్టీ సాధిస్తే, వారు అనేక పార్లమెంటరీ కమిటీల నియంత్రణను చేజిక్కించుకుంటారు. ఈ కమిటీల ద్వారా ట్రంప్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను నిలదీయవచ్చు. అధికారులను విచారణకు పిలవవచ్చు, కీలక పత్రాలను కోరవచ్చు. అంతేకాకుండా అవసరమైతే సమన్లు జారీ చేసే అధికారం వారికి లభిస్తుంది.

అమెరికా ప్రజలు యుద్ధాన్ని తిరస్కరించారు

ఇరాన్ స్పీకర్ మహ్మద్ బాగేర్ గలీబాఫ్

టెహ్రాన్, నవంబరు 4: అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపై ఇరాన్ స్పందించింది. ఈ ఎన్నికల ద్వారా అమెరికా ప్రజలు యుద్ధాన్ని తిరస్కరించినట్లు స్పష్టమైందని పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ గలీబాఫ్ వ్యాఖ్యానించారు. ఓటర్ల తీర్పు యుద్ధానికి వ్యతిరేకంగా వెలువడిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, అమెరికన్లు యుద్ధానికి 'నో' చెప్పారని, తాము ఈ సందేశాన్ని సమర్థిస్తున్నామని తెలిపారు. అయితే అమెరికా ప్రభుత్వం తన ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నవంబరు 3న జరిగిన మధ్యంతర ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతున్న సమయంలో గలీబాఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా రాజకీయాల్లో ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. ఓటర్ల ఆర్థిక ఆందోళనలు, విదేశాంగ విధానంపై అసంతృప్తి,ముఖ్యంగా ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక ఉద్రిక్తలు ఎన్నికలపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

'నా స్పేస్ లేజర్లు పనిచేయలేదు'

రిపబ్లికన్ల ఓటమిపై ఎలాన్ మస్క్ వ్యంగాస్త్రాలు

వాషింగ్టన్, నవంబరు 4: అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు రాజకీయంగా ఆసక్తికర పరిణామాలకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. రిపబ్లికన్లకు మద్దతుగా భారీగా నిధులు ఖర్చు చేసిన ఆయన, ఎన్నికల



ఫలితాలపై ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. మరోవైపు, డెమోక్రాట్ల విజయాలను అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రశంసించారు. ప్రజలను విభజించే రాజకీయాల కంటే ఐక్యతను కోరుకునే నాయకత్వానికే ఓటరు ప్రాధాన్యం ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలపై స్పందించిన ఎలాన్ మస్క్, అంతరిక్ష ఆధారిత డేటా సెంటర్ల ప్రస్తావన తీసుకొస్తూ వ్యంగ్యంగా పోస్ట్ చేశారు. 'ప్రస్తుతం అంతరిక్షంలోని డేటా సెంటర్లుచాలా ఆకర్షణీ యంగా కనిపిస్తున్నాయి. కానీ ఈసారి నా స్పేస్ లేజర్లు పనిచేయలేదని నేను అనుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

రైలుప్రమాదంపై స్పెయిన్ రైల్వే మంత్రి రాజీనామా



మాడ్రిడ్, నవంబరు 4: స్పెయిన్‌లో వరుస రైలు ప్రమాదాలు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఘోర హైస్పీడ్ రైలు ప్రమాదంలో 69 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనకు బాధ్యత వహిస్తూ ఆ దేశ రవాణా మంత్రి ఆస్కార్ పుయెంటె తన పదవికి రాజీనామా చేశారు. ప్రమాదం జరిగిన ఆరు రోజుల తర్వాత మంగళవారం ఆయన ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. పార్లమెంట్‌లో పలువురు సభ్యుల ప్రశ్నలకు గంటల తరబడి సమాధానాలు ఇచ్చిన అనంతరం తన రాజీనామా విషయాన్ని వెల్లడించారు.

నేడు ఫ్రీడమ్ పార్క్‌లో విపక్ష కూటమి నిరసన ప్రదర్శన

బెంగళూరు, నవంబరు 4:ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి మరోసారి ఉద్యమానికి సిద్ధమవుతుంది. ఇన్నాళ్లు దేశ రాజధాని ఢిల్లీకి పరిమితమైన నిరసనల్ని ఇప్పుడు రాష్ట్రాల్లో కూడా విస్తరించేందుకు ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగా గురువారం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రతిపక్ష కూటమి నేతలు ప్రకటించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు.

సరిహద్దుల్లో రైల్వేట్రాక్‌పై బాంబు పేలుడు



సూరత్‌గఢ్, నవంబరు 4: రాజస్థాన్‌లో ఉగ్రకుట్ర భగ్నమైనట్లు తెలుస్తోంది. శ్రీగంగానగర్ జిల్లాలో రైలును పేల్చేందుకు ప్లాన్ చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అనూప్‌గఢ్-సూరత్‌గఢ్ రైల్వే మార్గంలో మంగళవారం భారీపేలుడు సంభవించింది. ఈ ఘటనలో రైల్వే పట్టాల కింద ఉన్న రెండు నుంచి మూడు సిమెంట్ స్లీపర్ పిల్లర్లు దెబ్బతిన్నాయి. అనూప్‌గఢ్ నుంచి బటిండాకు వెళ్తున్న రైలు ఆ ప్రాంతాన్ని దాటిన కొద్దిసేపటికే ఈ పేలుడు సంభవించడంతో పెను ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది.

అత్తింటి వేధింపులకు ఐటి కోడలు అనుమానాస్పద మృతి



పుణె, నవంబరు 4:మహారాష్ట్రలోని పుణెలో 34ఏళ్ల మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెం దింది. ఓ అపార్ట్మెంట్‌లో ఉరివేసుకున్న స్థితిలో ఆమె కనిపించింది. పెళ్లయినప్పటి నుంచి అత్తింటి వారి వేధింపులు కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు ఆరోపిస్తు న్నారు. ప్రతీ దీపావళికి 10 తులాల బంగారం కట్నంగా ఇవ్వాలని వేధిస్తున్నారని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో ఆత్మహత్యకు ప్రేరేపించారనే ఆరోపణల నేపథ్యంలో ఆమె భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. మృతురాలిని పాయల్ జాంబ్రే పాటిల్‌గా గుర్తించారు. ఆమె గతంలో ఐటీ ఉద్యోగినిగా పనిచేసేవారని, తర్వాత ఉద్యోగం మానేశారని పోలీసులు తెలిపారు. ఆమెకు అక్షయ్ జాంబ్రే పాటిల్‌తో వివాహమైంది. ఈ ఇద్దరికి ఒక కుమార్తె ఉన్నారు.

నియంతలకు కాలం చెల్లిందని చెప్పిన తీర్పులు: సిజెపి నేతలు

న్యూఢిల్లీ, నవంబరు 4: అమెరికాలో జరుగుతున్న మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ పార్టీ రిపబ్లికన్లను కాదని జనం డెమోక్రాట్లను గెలిపిస్తుండటం, అంతకు ముందు ఇజ్రాయెల్‌లో బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వ ఏర్పాటుకు తగిన మెజార్టీ సాధించడంలో విఫలం కావడం వంటి పరిణామాలు అంతర్జాతీయంగా మార్పుకు సంకేతాలుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు నాయకులకు తగులుతున్న ఎదురుదెబ్బలపై కాక్రోచ్ జనతా పార్టీ కీలక విశ్లేషణ చేసింది. ఆ పార్టీ నేతలు అభిజీత్ దిప్కే, సౌరవ్‌దాస్ ఈ మేరకు ఎక్స్‌లో వేర్వేరు ట్వీట్లు చేశారు. ఒక శక్తివంతమైన నాయకుడు తమ సమస్యలన్నింటినీ పరిష్కరించగలడని ప్రజలను నమ్మించారని సీజేపీ జాతీయ కన్వీనర్ అభిజీత్ దిప్కేతెలిపారు.మరో సీజేపీ నేత సౌరవ్ దాస్ సైతం తాజా పరిణామాలపై స్పందించారు. నిరంకుశ ధోరణి కలిగిన ట్రంప్ పార్టీ, అమెరికా ప్రతినిధుల సభ (హౌస్), సెనేట్ రెండింటిపై తన పట్టును కోల్పోయిందని, ప్రపంచవ్యాప్తంగా నియంతలుగా మారాలని ఆశించే వారికి ఇది చాలా కష్టకాలంలా కనిపిస్తోందన్నారు.

సంక్షేమ పథకాలకు ఇకపై ఓటరు కార్డు లింకు

సర్ ఓట్ల తొలగింపువేళ కేంద్రం కొత్త నిర్ణయం?

న్యూఢిల్లీ, నవంబరు 4: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్షపై ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న వేళ కేంద్రంలోని మోదీ సర్కార్ చర్యలు ప్రజల్లో ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. సర్ ప్రక్రియ ద్వారా అక్రమంగా లక్షలాది ఓట్లను తొలగిస్తున్నారని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న క్రమంలో సంక్షేమ పథకాలకు ఓటర్ ఐడీని ముడిపెట్టే దిశగా కేంద్రం అడుగులు వేస్తుండటం గుబులు రేపుతున్నది. ఇప్పటివరకు అన్ని పథకాలకు ఆధార్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుండగా, ఇకపై ఆధార్‌కు బదులుగా ఓటరు కార్డునే ఆధారంగా తీసుకోవాలని కేంద్రం భావిస్తున్న

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం



బుధవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి భూసర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రైతుల సమక్షంలోనే సమగ్ర భూసర్వే
వచ్చే యేడాదిలోగా ప్రతి అంగుళం భూమి సర్వే
అధికారుల సమక్షంలోనే క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రధానంగా రైతుల ప్రయోజనాల కోసమే భూముల రీసర్వే చేపడుతున్నామని, రైతుల భూ సమస్యల పరిష్కారానికి వారి సమక్షంలోనే రీసర్వే జరగాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రీసర్వే జరిగే గ్రామాల్లో ప్రతిరోజు తహశీల్దార్లు పర్యటించాలని, ఆర్డీవో, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడమేగాక కనీసం వారానికోరోజు రీసర్వే జరిగే గ్రామాలకు వెళ్లాలని స్పష్టం చేశారు. వచ్చే యేడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సమగ్రంగా సర్వేచేసి, భూ యజమానులకు పూర్తి భద్రతతో కూడిన వివాదరహిత భూములను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో వారి భూమికి సంబంధించిన సమగ్ర, భద్రతతో కూడిన రికార్డులు, పాస్‌బుక్కులు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు.

బుధవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి భూ సర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్లో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని చట్టంలో నిర్దేశించిన విధంగా తొలుత రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతగా వేగవంతంగా చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

గతంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించామని, ఈసారి నేరుగా జిల్లాలకు వచ్చి స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో సమావేశమై సమస్యలను సమీక్షి స్తున్నట్లు చెప్పారు. మండల స్థాయి అధికారుల జాబితా నుంచి యాదృచ్ఛికంగా అధికారులను ఎంపిక చేసి, ఆయా మండలాల్లో సర్వేకు సంబంధించిన అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై నేరుగా చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరిస్తూ బాధ్యతా యుతంగా పనిచేసే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని మంత్రి తెలిపారు. ఉద్దేశపూర్వకంగా సమస్యలను తప్పుదోవ పట్టించే లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై అదే స్థాయిలో తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

ఈ సర్వే ద్వారా కేవలం భూముల కొల తలకే పరిమితం కాకుండా, సర్వే నంబర్ల ఒకచోట ఉండ టం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. 22ఎ కు సంబంధించి ఇప్పటివరకు ఇచ్చిన జీవోలు, మెమో లతో కవర్ కానీ అంశాలు ఏమైనా ఉంటే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్ రెడ్డి, అరికేపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



బుధవారం ఐటిసి కాకతీయలో నిర్వహించిన ఫిక్కీ వందేళ్ల వేడుకలు, 'తెలంగాణ డీప్ - టెక్ లీడర్ షిప్ సమ్మిట్'లో పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

డీప్‌టెక్, ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ
ఫిక్కీ వందేళ్ల వేడుకలు, 'తెలంగాణ డీప్ - టెక్ లీడర్‌షిప్ సమ్మిట్'లో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్,నవంబరు4,ప్రభాతవార్త: తెలంగాణను ప్రపంచ స్థాయి డీప్‌టెక్, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయబోయే ఏఐ, క్వాంటం టెక్నాలజీ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లు, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. బుధవారం బేగంపేట్ లోని ఐటీసీ కాకతీయలో నిర్వహించిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) వందేళ్ల వేడుకలు, 'తెలంగాణ డీప్ - టెక్ లీడర్ షిప్ సమ్మిట్'లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఫిక్కీ వందేళ్ల ప్రస్థానం భారత పారిశ్రామిక రంగ పరిణామానికి అద్దం పడుతోందన్నారు. 2025-26లో రాష్ట్ర జీఎస్‌పీఏలో పారిశ్రామిక రంగం వాటా 8.1 శాతం వృద్ధి రేటుతో రూ.3.04 లక్షల కోట్లకు చేరిందన్నారు. స్టేట్ మర్చండైజ్ ఎక్స్ పోర్ట్స్ 39.3 శాతం పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో ఫిక్కీ తెలంగాణ ఛాప్టర్ చైర్మన్ వి.వి. రామరాజు, కో చైర్మన్ జయదేవ్ మీలా, ఎఫ్ టీసీసీఐ ప్రెసిడెంట్ కె.కె.మహేశ్వరి, అపోలో హాస్పిటల్స్ ఎంటర్ ప్రైజెస్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14 మంది సీనియర్ విద్యార్థులపై సస్పెన్షన్ వేటు

కామారెడ్డి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలో మరోసారి ర్యాగింగ్ భూతం బుసలుకొట్టింది. కామారెడ్డి జిల్లా మెడిక ల్ కాలేజీలో జూనియర్లను కొందరు సీనియర్లు అదేపనిగా తమకు నమస్కారాలు చేయాలని వేధిస్తున్నారని, దూషిస్తున్నారని జూనియర్లు చేసిన ఫిర్యాదు కలకలం రేపింది. దీనిపై విచారించిన కాలేజీ యాజమాన్యం 14 మంది సీనియర్లను సస్పెండ్ చేసింది. వివరాలు ఇలావున్నాయి. రా ష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కామారెడ్డి ఒకటి కాగా ఇందులో దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. అయితే కొంతకాలంగా ఇక్కడ జూనియర్లను సీనియర్లు అదేపనిగా ర్యాగింగ్ చేస్తుండడం కలకలం రేపింది. దీనిపై కొందరు బాధిత జూనియర్ విద్యార్థులు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగు చూసింది. కళాశాల హాస్టల్‌లో కొందరు సీనియర్లు తమను నిర ంతరం వేధిస్తున్నారని, తమను చూసిన ప్రతిసారీ గుడ్ మార్నింగ్ చెప్పాలంటూ ఒత్తిడి తెస్తున్నారని జూనియర్ విద్యార్థులు వాపోయారు. విధిలేక తాము వారం రోజుల క్రితం ఎన్ఎంసి యాంటి ర్యాగింగ్ సెల్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలి పారు. కాగా దీనిపై ఎన్ఎంసి అధికారుల ఆదేశాల మేరకు కామారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వాల్యా నేతృత్వంలోని యాంటీ ర్యాగింగ్ కమిటీ మంగళవారం నాడు అంతర్గత విచారణ చేపట్టింది. విచారణలో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారణ కావడమే కాకు ండా, అందుకు సంబంధించిన వీడియో ఆధారాలు కూడా లభించడంతో దీనికి కారకులైన సీనియర్లను గుర్తించింది. ఈ ఘటనకు సంబంధించి జూనియర్లను తీవ్రంగా వేధించిన నలుగురు విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేశారు. మిగిలిన 10 మంది విద్యార్థులను నాలుగు నెల ల పాటు సస్పెండ్ చేశారు. కాగా ఈ ఉదంతంపై కళాశాల ప్రిన్సిపాల్ వాల్యా మాట్లాడుతూ జూనియర్ల ఫిర్యాదుతోనే ఈ వ్యవహారం వెలుగు లోకి వచ్చిందని తెలిపారు. ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారమే ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నామని, తదుపరి విచారణ కొన సాగుతోందని వివరించారు. కళాశాల ప్రాంగణంలోనైనా, హాస్టల్‌లోనైనా ర్యాగింగ్‌కు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సినీనటుడు నితిన్ నార్నెకు విజయవంతంగా శస్త్రచికిత్స

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: సినీనటుడు నితిన్ నార్నె సినిమా షూటింగ్ సమయంలో కుడి భుజానికి గాయం కావడంతో బుధవారం నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఈ గాయానికి సంబం ధించి బుధవారం ఉదయం ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించారు. డాక్టర్ ఆర్.ఏ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలోని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జరీ బృందం ఈ శస్త్రచికిత్సను నిర్వహించింది. ఈ బృందంలో డాక్టర్ ఈశ్వర్ పటేల్, డాక్టర్ హరికృష్ణ బచ్చు, డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని కిమ్స్ ఆసుపత్రి వెల్లడించింది. ప్రస్తుతం నితిన్ నార్నె ఆరోగ్యం సంతృప్తికరంగా ఉందని, ఆయన వైద్యపరంగా స్థిరంగా ఉన్నారని తెలిపింది. వైద్యుల పర్యవేక్షణలో కొంత కాలం విశ్రాంతి తీసుకోవాలని, అనంతరం ప్రణాళికాబద్ధమైన పునరావాస చికిత్స (రీహాబిలిటేషన్) పొందాలని వైద్యులు సూచించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిలో గణనీయమైన మార్పు చోటుచేసుకుంటేనే తదుపరి వివరాలను వెల్లడిస్తామని ఆసుపత్రి పేర్కొంది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు గోప్యతను కోరారు. ఎలాంటి ఊహాగానాలు చేయవద్దని, పరామర్శల కోసం ఆసుపత్రికి రావొద్దని విజ్ఞప్తి చేశారు.



సినీనటుడు నితిన్‌నార్నె



నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రారంభించిన పోలీస్ కమిషనర్‌సాయి చైతన్య.

నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ వెబ్‌సైట్, సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రారంభం

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: నిజామాబాద్ జిల్లా సెక్యూరిటీ కౌన్సిల్ అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా హ్యాండిల్స్ బుధవార ం ప్రారంభమయ్యింది. దీనిని పోలీస్ కమిషనర్‌సాయి చైతన్య లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సెక్యూరి టీ కౌన్సిల్ చేపడుతున్న కార్యక్రమాలు, కార్యకలాపాలు మరియు భద్రతకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా వేదికలు కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమ ర్థవంతంగా వినియో గించుకుంటూ ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సులభంగా అందు బాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఆయ న పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కవితా రెడ్డి , ట్రెజరర్ కె. సంతోష్ కుమార్, జా యింట్ సెక్రటరీ రజినీకాంత్, నిజామాబాద్, ట్రాఫిక్ ఎ.సి.పి ప్రకాష్ పాల్గొన్నారు.

గాంధీభవన్ ముందు కేంద్ర హోమ్‌మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దగ్ధం

హైదరాబాద్, నవంబరు 4,ప్రభాతవార్త: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మను గాంధీభవన్ ముందు దగ్ధంచేసి కాంగ్రెస్ శ్రేణులు బుధవారం నిరసన తెలిపారు. పిసిసి ఫిషరీస్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్,గ్రంథాలయ మాజీ ఛైర్మన్ రియాజ్, ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. తెలంగాణకు అమిత్ షా వచ్చి అపద్దాలు మాట్లాడిండు అని మెట్టు సాయికుమార్ ఆరోపించారు. 12 యేళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ ఏమి ఇచ్చింది అని ఫైర్ అయ్యారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి తెలంగాణ కు ఏమి నిధుల తెచ్చారనినిలదాశారు. మూడు సంవత్సరాలు నుండి తెలంగాణను అభివృద్ధి చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డిపై ఆర్ఆర్ ట్యాక్స్ అంటూ ఆరోపణలు చేస్తుండు అని ఆయన ఆరోపించారు.

రూ.40 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన బజార్‌హత్నూర్ ఎస్ఐ రమేష్

బజార్‌హత్నూర్, నవంబరు 4, ప్రభాతవార్త: ఆదిలాబాద్ జిల్లాలో ఓ అవినీతి పోలీస్ అధికారి నిర్వాకం బుధవారం వెలుగులోకి వచ్చింది. ఒక కేసు వ్యవహారంలో బాధితుడిని వేధించి, లంచం తీసుకుం టుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్, ఒక కేసు విషయమై బాధితుడి నుంచి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత పెద్దమొత్తంలో ఇచ్చు కోలేనని, తనను కరుణించాలని బాధితుడు బతిమిలాడటంతో, చివరికి రూ. 40 వేలు ఇచ్చేలా ఎస్ఐ ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే, ఎస్ఐ రమేష్ వేధింపులను భరించలేని బాధితుడు నేరుగా అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ గొర్రె మధు పక్కా ప్రణాళికతో వ్యూహాత్మ కంగా వల పన్నారు. బుధవారం రోజున బాధితుడి వద్ద నుంచి ఎస్ఐ రమేష్ రూ. 40 వేల లంచం డబ్బును తీసుకుంటుండగా ఏసీబీ అధికా రులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం డబ్బును స్వాధీనం చేసుకున్న అధికారులు, వెంటనే ఎస్ఐ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా సోదాలు నిర్వహించారు. ఎస్ఐపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెనుకాడకుండా తక్షణమే 9440446106, నంబర్, అలాగే 1064 టోల్ ఫ్రీ నంబర్ సంప్రదించాలని, అవినీతి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఏసీబీ డీఎస్పీ గొర్రె మధు సూచించారు.



ఎస్ఐ రమేష్

అమిత్‌షాకు 14 ఎంపి సీట్లతో సమాధానం చెపుతాం

పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి

హైదరబాద్,నవంబరు4,ప్రభాతవార్త: అమిత్‌షా అహంకారంకు తెలంగాణలో 14 ఎంపిసీట్లు గెలిచి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసి సమాధానం చెబుతామని టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రైమ్ మినిస్టర్ అవుతారో లేదో తెలీదు కానీ ప్రధాన మంత్రి పదవిమాత్రం రాహుల్ గాంధీ కుటుంబం లో పుట్టిందనే విషయాని మరిచిపోయి అమిత్‌షా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రధాని అయ్యే అవకాశం లేదని అమిత్ షా అనడం హాస్యాస్పదమని అన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రజలు నేరుగా నెహ్రూ నీ ప్రధానిగా ఎన్నుకున్నారనీ మోడీ ప్రధాన మంత్రి అయ్యి 13ఏళ్లు అయిందనీ గుర్తుచేశారు. 2004 లో సోనియా గాంధీ నేతృత్వం లో యూపిఎ ప్రభుత్వం ఏర్పడింది.సోనియా, రాహుల్ గాంధీ నీ ప్రధాని కావాలని ఎంపిలు అందరు తీర్మానం చేశారు కానీ మాకు ప్రధాన మంత్రి పదవి వద్దన్నారనీ ఆయన చెప్పారు. మన్మోహన్ సింగ్ నీ ప్రైమ్ మినిస్టర్ చేశారనీమన్మోహన్ సింగ్ సైతం ప్రైమ్ మిస్టర్ అయ్యాక రాహుల్ గాంధీ దగ్గరికి వెళ్ళి ప్రైమ్ మినిస్టర్ కావాలని కోరారు కానీ రాహుల్ గాంధీ తిరస్కరించి మీరే ఉండాలి మీ నేతృత్వం లోనే పని చేస్తామని అన్నారనీ చరిత్రను వివరించారు. ఉపాధి హామీ పథకం తీసుకొచ్చి దేశంలో పెద్ద ప్రజలను ఆదుకున్నది కాంగ్రెస్‌ప్రభుత్వమని అన్నారు.

అమిత్ షా మీరెవ్వరు రాహుల్ ప్రధాని కాలేదని చెప్పడానికి అని ప్రశ్నించారు. మీకు చెప్పే హక్కే లేదు..రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలనీ ప్రజలు కోరుకుంటే ప్రధాని చేస్తారనీ చెప్పారు. ఈ దేశ ఓటర్లను శాసించే హక్కు మీకు లేదు.. తెలంగాణలో కాంగ్రెస్‌కు బలం, బలగం ఉందని బిజెపికి లేదని ఛాలెంజ్‌గా తీసుకుంటాము రాహుల్‌గాంధీ ప్రధాని కావడానికి పని చేస్తామన్నారు.

శ్రీరాముడి పేరుతో మీరు అధికారంలో ఉన్నారు. మంచిది కానీ ఆయన అడుగుజాడల్లో మీరు పరిపాలన సాగించడం లేదని కేవలం రాజకీయాల కోసం మాత్రమే శ్రీరాముడి పేరు ఉపయోగిస్తున్నారని ఆరోపిం చారు. మహాత్మాగాంధీ రఘుపతి రాఘవ రాజారాం పతీత పావన సీతా రామ అని భజనచేసే సమయంలో బిజెపి పార్టీయే పుట్టలేదని అన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలనే నెహ్రూ, గాంధీ కుటుంబం కోరుకున్నదని అన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ పేరుతో ఓట్లు తీసుకునే ప్రయత్నం బిజెపి చేసిందనీ అన్నారు. రాహుల్‌గాంధీని ప్రధాని చేస్తాము.. దాని కోసం 17 ఎంపి స్థానాల్లో 14 స్థానాలు గెలిచేందుకు పని చేస్తామని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు.

వాతావరణ మార్పులను తట్టుకునే మొక్కజొన్న సాగు

♦మూడు సంస్థల భాగస్వామ్యం ♦ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో హార్వెస్ట్ కార్యక్రమం ♦ 35 వేల మంది రైతులకు లబ్ధి

హైదరాబాద్ (శంషాబాద్) నవంబరు 4, ప్రభాతవార్త: వాతావరణ మార్పులను తట్టుకునే మొక్కజొన్న సాగును ప్రోత్సహించడంతోపాటు రైతులకు స్థిరమైన ఆదాయం అందించే లక్ష్యంతో బుధ వారం శంషాబాద్‌లో నిర్వ హించిన కార్యక్రమంలో జీఐజెడ్, పెప్సికో ఇండియా, బేయర్ క్రాప్‌సైన్స్ సంస్థలు సంయుక్తంగా హార్వెస్ట్ పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ఏర్పడుతున్న అస్తవ్యస్త వర్షపాతం, కరవు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను భారతీయ మొక్కజొన్న పరిశోధనా సంస్థతో పాటు ప్రభుత్వ, పరిశోధనా సంస్థల సహకారంతో స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన సాగు పద్ధతులను రూపొందించనున్నారు.



సమావేశంలో పాల్గొన్న పలువురు శాస్త్రవేత్తలు, సంస్థల ప్రతినిధులు

ప్రదర్శనా వ్యవసాయ క్షేత్రాలు, రైతుల మధ్య పరస్పర అవ గాహన కార్యక్రమాల ద్వారా నూతన పద్ధతులను ఆచరణలో చూపించనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది సామర్థ్యాలను కూడా పెంపొందించనున్నారు.ఈ సందర్భంగా జీఐజెడ్ ఇండియా, భూటాన్ కంట్రీ డైరెక్టర్ ఉల్రికే ఎబెలింగ్ మాట్లాడుతూ.. రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని తెలిపారు. పెప్సికో ఇండియా సీనియర్ డైరెక్టర్ అశోక్ రాయ్, బేయర్ క్రాప్‌సైన్స్ ప్రతినిధి సైమన్ వైబుష్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిజ్ఞానం, నూతన సాంకేతికత, రైతుల భాగస్వామ్యంతో వ్యవ సాయ రంగాన్ని మరింత పటిష్ఠం చేయడమే హార్వెస్ట్ ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు.

రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్
గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం: కలెక్టర్ రాజర్షి షా, ఎంపి గోడం నగేష్

ఉట్నూర్, నవంబరు 4, ప్రభాతవార్త: ఆదిలాబాద్ జిల్లాలో అమరజీవి కురం నూరు 29వ వర్ధంతి వేడుకలను ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ మండలం కొలంగూడలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్, ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పిఒ మంద మకరందు, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ ప్రణయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై కుంరంసూరు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులు ఎదుర్కొం టున్న వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ, ఫారెస్ట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి గిరిజన బిడ్డలకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. గిరిజనులు తమకు లభించిన చట్ట పరమైన హక్కులను, కోర్టుల ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో కొలమ్‌జాతికి చెందిన 7,000 కుటుంబాలు ఉన్నాయని, 9 శాఖల ద్వారా పీఎం జన్మన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజనుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలు, పోడు భూముల సమస్యలు, అలాగే ఆర్‌వోఎఫ్ఆర్ చట్టంలోని కొలమ్, నివాసం, కమ్యూనిటీ అనే 3 రకాల హక్కులపై ప్రత్యేక దృష్టి సారించామని, త్వరలోనే అర్హులైన వారికి తగిన ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఎంపి గోడం నగేష్ మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను అనుసరించాలని, వాటిని భావితరాలకు అందజేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో పివిటిజి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోనేరావు, జిల్లా అధ్యక్షులు వసంత్ రావు, స్థానిక ప్రజాప్రతి నిధులు, ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ, ఫారెస్ట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు, సంఘ నాయకులు, కొలమ్ కుల బాంధవులు, పోలీసులు, ఇతర అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రమశిక్షణరాహిత్యంపై పిసిసి సీరియస్
మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంతం గాంధీభవన్‌కు రావాలి
పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశం

హైదరాబాద్, నవంబరు 4,ప్రభాతవార్త: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మంత్రులకు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు మధ్య విభేదాలు పెరిగి ప్రభుత్వానికి, పార్టీకి మధ్య అగాధం ఏర్పడుతుండటంతో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి చేతినిండా పని లభించింది. కొండా సురేఖను మంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేశాక ఇక అంతా సద్దుమణుగుత

‘మురసు’ తుఫాను విలయం

- ఉమ్మడి ఖమ్మం జలదిగ్బంధం - చేతికొచ్చిన పత్తి, మిర్చి పంటలు మట్టిపాలు! - ప్రమాదకర స్థాయికి చేరిన జలాశయాలు! - పెదవాగు ప్రాజెక్టుకు గండి - లక్ష టన్నులు బొగ్గుకు అంతరాయం

ఖమ్మం బ్యూరో , ప్రభాతవార్త : ఉమ్మడి ఖమ్మం జిల్లాను ‘మురసు’ తుఫాను కమ్మేసింది. అసాధారణ వాతావరణ మార్పుల నేపథ్యంలో కురుస్తున్న రికార్డు స్థాయి భారీ వర్షాలకు ఏజెన్సీ గుండెకాయ లాంటి గ్రామాల నుండి నగరాల వరకు సర్వం జలమయమయ్యాయి. భారత వాతావరణ శాఖ ఇప్పటికే జిల్లాకు అత్యంత ప్రమాదకరమైన ‘రెడ్ అలర్ట్’ హెచ్చరికలు జారీ చేసింది. వాగులు, వంకలు కాజ్‌వేల పైనుంచి ప్రవహిస్తుండటంతో వందలాది గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ప్రమాదకర స్థాయికి వరద భారీ వర్షాల కారణంగా ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, తాగునీటి వనరులు మునుపెన్నడూ లేని విధంగా పోటెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ సాగునీటి వనరులైన వైరా ప్రాజెక్టు, పాలేరు జలాశయం, కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తుతోంది. వైరా జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమై దిగువన ఉన్న కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగునీటి ప్రధాన కాలువలకు అక్కడక్కడా గండ్లు పడటంతో వరద నీరు పంట పొలాల్లోకి ప్రవేశిస్తోంది. మున్నేరు నది ఖమ్మం నగర పరిధిలో వరద నీరు చేరువ కావడంతో తీర ప్రాంత ప్రజలు వణుకుతున్నారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం లో అధిక వర్షపాతం నమోదయింది. లింగపాలెం స్కూల్ ఆవరణంలోకి వర్షం నీరు చేరడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు ఆందోళన గురయ్యారు. దమ్మపేట మండలంలో 24 గంటల పరిధిలోని 16.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది దమ్మపేట పాల్వంచ ప్రధాన రహదారిపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు ఖమ్మం జిల్లా కొత్త ఎర్రబోయిన పల్లిలో మద్దుల చెరువు అలుగు పోస్తుంది దీంతో సమీపంలోని 30 ఎకరాలు పొలాలు నీట మునిగాయి. పెదబాబు ప్రాజెక్టుకు గండిపడటంతో ఏలూరు జిల్లాలోని వేలూరుపాడు మండలంలో గల గ్రామాల్లో వరద నీరు చేరడంతో ఆయా ప్రజలు ఆందోళన గురవుతున్నారు వరద ఉధృతి కారణంగా మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్స్ వద్దకు బురద నీరు, వ్యర్థాలు భారీగా వచ్చి చేరాయి. నదులలో నీరు పూర్తిగా కలుషితం కావడంతో తాగునీటి శుద్ధి ప్రక్రియకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పంపింగ్ మోటార్లు మునిగిపోయే ప్రమాదం ఉండటంతో ముందస్తు జాగ్రత్తగా అధికారులు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో తాగునీటి సరఫరాను నిలిపివేశారు. ప్రజలు సురక్షి తమైన లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలని హెచ్చరిస్తున్నారు. ఈ అకాల తుఫాను ఉమ్మడి జిల్లాలోని పత్తి, మిర్చి రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఎకరాకు వేలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడిగా పెట్టిన రైతుల శ్రమ అంతా తుఫాను వరదల్లో కొట్టుకుపోయింది. సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి, మధిర, వేంసూరు మండలాల్లో పత్తి పంట ప్రస్తుతం చేతికి వచ్చే కీలక దశలో ఉంది. ఈ సమయంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల ధాటికి పత్తి కాయలు రాలిపోయి బురద పాలయ్యాయి. చేలలో ఉన్న పత్తి పూర్తిగా తడిసి నల్లగా మారిపోయింది. నాణ్యత పూర్తిగా లోపించడంతో మార్కెట్‌లో దీనికి కనీస మద్దతు ధర కూడా లభించదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో వేలాది ఎకరాల్లో సాగు చేసిన మిర్చి తోటలు నీట మునిగాయి. తోటల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయింది. మిర్చి తోటల్లో 24 గంటల కంటే ఎక్కువ సమయం నీరు నిలిచి ఉంటే ‘వేరు కుళ్లు’, ‘కొమ్మ కుళ్లు’ తెగుళ్లు సోకి పంట మొత్తం ఎండిపోతుంది. పెట్టుబడి కింద పెట్టిన రూ. 80 వేల నుండి లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని, తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రవాణా, విద్యుత్ వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలడంతో సామాన్య ప్రజల జీవన విధానం నరకప్రాయంగా మారింది. పాల్వంచ, ఇల్లందు, మణుగూరు, అశ్వారావుపేట రూట్లలో రోడ్లపై చెట్లు విరిగిపడటంతో అంతర్రాష్ట్ర రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు వంగిపోవడంతో గ్రామాల్లో చీకటి రాజ్యమేలుతోంది. ముందస్తు జాగ్రత్తగా అధికారులు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.



ఇది నిరసనల జమానా..

సుప్రీంకు ఎందుకు వచ్చారు?

ఎస్సీ, ఎస్టీ సెగ్మెంట్ల రొటేషన్‌పిటిషన్‌పై విచారణలో చీఫ్‌జస్టిస్ సరదా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 4: ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల రొటేషన్‌పై దాఖలైన ఓ పిటిషన్ విషయంలో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సరదా వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంలో నిరసనలు చేపట్టకుండా సుప్రీం కోర్టును ఎందుకు ఆశ్రయించారని సరదాగా ప్రశ్నించారు. ఇటీవల కాలంలో నిరసనలతో దేశరాజధాని మార్మోగిపోతున్న నేపథ్యంలో చీఫ్ జస్టిస్ ఈ కామెంట్స్ చేశారు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలను కూడా రొటేషన్ చేయాలంటూ పిటిషనర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ ‘మీరు రాంగ్ నంబర్‌కు ఫోన్ చేసినట్టు ఉన్నారు. ఇది నిరసనలు, ప్రదర్శనల జమానా మీరు కూడా అదే మార్గంలో వెళితే బాగుంటుందేమో అని అన్నారు. దీనిపై పిటిషనర్ తరఫు న్యాయవాది కూడా అంతేసరదాగా స్పందించారు. తమకు అసలు అలాంటి ఉద్దేశమే లేదని చెప్పారు. తమకు గొంతు గరగర కూడా ఉందని చెప్పారు. యూపీ సుల్తాన్‌పూర్‌కు చెందిన జగదీశ్ సింగ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గాల కారణంగా కొన్ని కుటుంబాలే లబ్ధి పొందాయని ఆరోపించారు. పంజాయతీ, పురపాలక సంస్థల ఎన్నికల్లో అనుసరిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలను రొటేట్ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రొటేషన్ విధానం లేకపోవడం ఆర్టికల్ 14, 15, 19లను ఉల్లంఘించడమేనని చెప్పారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాలా బాగ్చీ, వీ మోహన మాట్లాడుతూ ఓటింగ్ కులం ఆధారంగానే ఉంటుందని భావించడం తప్పని చెప్పారు. ఎవరికి ఓటేయాలనేది ప్రజల నిర్ణయమేనని చెప్పారు. ఓ నియోజకవర్గం రిజర్వ్ అయినంత మాత్రాన ప్రజల ఓటు హక్కుపై ప్రభావం పడదని అన్నారు. ఎవరికైనా ఓటు వేసే హక్కు ప్రజలకు ఉంటుందని చెప్పారు. ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేశారు.

తెలంగాణలో కొత్తగా మిల్లెట్ కేఫ్‌లు

చిరు ధాన్యాలతో ఆహార పదార్థాలు

తొలి విడత రూ.11 కోట్లతో 5 కేంద్రాలు

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త : తెలంగాణలో చిరుధాన్యాల సాగును విస్తరించడంతో పాటు, మహిళలకు కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు గాను రాష్ట్రవ్యాప్తంగా మిల్లెట్ కేఫ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తొలి విడతలో హైదరాబాద్ పరిధిలో మూడు, మహిళా రైతులు అధికంగా చిరుధాన్యాలు పండించే మహబూబ్‌నగర్, యాదగిరిగుట్ట ప్రాంతాల్లో మరో రెండు కేంద్రాల చొప్పున మొత్తం 5 కేఫ్‌ల ఏర్పాటుకు అనుమతినిచ్చింది. దశలవారీగా ఇతర జిల్లాల్లోనూ వీటిని విస్తరించనున్నారు. చిరుధాన్యాలతో తయారుచేసిన ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, వాటి సాగు నుంచి విక్రయాల వరకు మహిళా రైతులకు ప్రయోజనం చేకూర్చడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా వ్యవసాయ అధికారవర్గాలు వెల్లడించాయి. ఒక్కో కేఫ్ నిర్మాణం, మోలిక సదుపాయాల కల్పనకు రూ.2.2 కోట్ల చొప్పున ఖర్చు చేయనుంది. ఐదు కేఫ్‌లకు కలిపి మొత్తం రూ.11 కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. కేఫ్‌ల నిర్వహణ, ఆహార పదార్థాల తయారీ, వ్యాపార నిర్వహణలో మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ, ఏపీ ఉత్పాదక మండలితో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఐఐఎంఆర్ ఇప్పటికే ఐదు కేఫ్‌లకు చెందిన 40 మంది మహిళలకు శిక్షణ ఇచ్చింది. ఈ మిల్లెట్ కేఫ్‌లలో చిరుధాన్యాలతో తయారుచేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచనున్నారు. మిల్లెట్ కేకులు, బిస్కెట్లు, రొట్టెలు, మురుకులు, పులిహోరతో పాటు రాగి సంకటి, రాగి జావ, మిల్లెట్ ఉప్మా, కిచిడీ వంటి వంటకాలను విక్రయించనున్నారు. సంప్రదాయ ఆహార పదార్థాలను ఆధునిక రీతిలో ప్రజలకు పరిచయం చేయడం ద్వారా చిరుధాన్యాల వినియోగాన్ని పెంచాలని అధికారులు భావిస్తున్నారు. వీటి ద్వారా మహిళా సంఘాలకు ఆదాయం సమకూరడంతో పాటు స్థానికంగా పండించే చిరుధాన్యాలకు మార్కెట్ ఏర్పడే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు, పరిగెలు వంటి చిరుధాన్యాల సాగు సుమారు 50 వేల ఎకరాలకే పరిమితమైంది.



యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించిన జెన్కో సిఎండి హరీష్

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: రాష్ట్రం లోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (జెన్కో) సిఎండి డాక్టర్ ఎస్ హరీష్ పరిశీలించారు. నిర్మాణ పనులు చేపట్టిన భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఇఎల్) డైరక్టర్ తజీందర్ గుప్తాతో కలసి హరీష్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యంగా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సిహెచ్‌పి)కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ సందర్భంగా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లోని వ్యాగన్ టిప్లర్లు, క్రషర్ హౌస్ తదితర యూనిట్లకు సంబంధించిన వివిధ ప్రాంతాలను సందర్శించారు. అనంతం యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి వివిధ యూనిట్ల పనితీరు, సమస్యలు తదితర వాటిపై చర్చించారు. ఈ సమావేశంలో డైరక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ లక్ష్మయ్య, బిహెచ్ఇఎల్ ప్రాజెక్టు డైరక్టర్ బికాష్ మిశ్రా, చీఫ్ ఇంజనీర్ సూర్యనారాయణ, సబ్ వెండర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీగా తగ్గిన విద్యుత్ వినియోగం

- 14546 మెగావాట్లకు పడిపోయిన డిమాండ్- వారంలో 4 వేల మెగావాట్ల తగ్గుదల - ఊపిరి పీల్చుకున్న రాష్ట్ర పంపిణీ సంస్థలు

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: తుపాను ప్రభావంతో వచ్చిన మార్పుల కారణంగా తెలంగాణలో గరిష్ట విద్యుత్ డిమాండ్ పడిపోయింది. నప్రస్తుతం 14000 మెగావాట్లకు విని యోగం లో తగ్గుదల చోటు చేసుకుంది. ఇది అక్టోబర్ 16న రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన రికార్డు స్థాయి 20018 మెగావాట్ల (335.06 మిలియన్ యూనిట్లు) కంటే దాదాపు 5500 మెగావాట్లు (120 మిలియన్ యూనిట్లు) తక్కువ. అలాగే గత నెల 23న 18216 మెగావాట్ల (324.63 మిలియన్ యూనిట్లు) డిమాండ్ నమోదు కాగా, అది క్రమేపీ 4 వేల మెగావాట్లకు పడిపోయి ఇప్పుడు (ఈ నెల 3వ తేదీ) 14093 మెగావాట్లకు (258.42 మిలియన్ యూనిట్లు) చేరుకుంది. ప్రధానంగా వ్యవసాయ రంగం విద్యుత్‌ను అత్యధికంగా వినియోగించే ఏకైక రంగంగా కొనసాగుతోంది. మొత్తం వినియోగంలో దాదాపు 40 శాతం వాటాతో, 30 లక్షలకు పైగా వ్యవసాయ పంపుసెట్ కనెక్షన్లు కలిసి రోజుకు సుమారు 7000 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నాయి. గత నెల 23న 18,216 మెగావాట్లు ఉన్న డిమాండ్ 24న 17,636 మెగావాట్లకు (316.08 మిలియన్ యూనిట్లు), 29న 15,138 మెగావాట్లకు (274.65 మిలియన్ యూనిట్లు) తగ్గింది. ఇది ఈ నెల 1న 14,546 మెగావాట్లకు (264.56 మిలియన్ యూనిట్లు) మరింత పడిపోయి, 2న స్వల్పంగా పెరిగి 14,696 మెగావాట్లకు (267.98 మిలియన్ యూనిట్లు), 3వ తేదీకి అది మళ్లీ తగ్గి 14093 మెగావాట్లకు (258.42 మిలియన్ యూనిట్లు) చేరింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఎల్ నినో పరిస్థితులతో ముడిపడిన అధిక ఉష్ణోగ్రతలు విద్యుత్ వినియోగాన్ని రికార్డు స్థాయికి చేర్చాయి. ఈ అసాధారణ అధిక డిమాండ్‌ను తీర్చడానికి, బహిరంగ మార్కెట్ నుండి ఖరీదైన విద్యుత్ కొనుగోళ్లపై రాష్ట్రం ఆధారపడటం తగ్గింది. కాలానుగుణంగా తగ్గుదల ఉన్నప్పటికీ, రైతులు సాగునీటి కోసం బోర్‌వెల్‌లపై ఆధారపడటం కొనసాగిస్తున్నందున వ్యవసాయ వినియోగం గణనీయంగానే ఉంది. రాష్ట్రంలోని రైతులు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1.25 కోట్ల ఎకరాలకు పైగా సాగు చేశారు. ఇందులో ప్రధానంగా 56.8 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు.

అనేక ప్రాంతాలలో నీటి విని యోగం అధికంగా ఉండే పంటల విస్తరణ, తగినంత వర్షపాతం లేకపోవడం వల్ల భూగర్భ జలాలు, విద్యుత్ ఆధారిత నీటిపారుదలపై ఆధారపడటం పెరిగింది. రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌లో హైదరాబాద్ విద్యుత్ వినియోగం మరో ప్రధాన భాగంగా ఉంది.

విద్యుత్ ఉద్యోగులకు డిఎ పెంపునకు డిప్యూటీ సిఎం భట్టి ఆమోదం

డిఎ పెంపు అమలుకు కృతజ్ఞతలు తెలిపిన టిజిపిఇజెఎసి

హైదరాబాద్,నవంబరు4,ప్రభాతవార్త:విద్యుత్ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) పెంపునకు ఆమోదం తెలపడంపై తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను టిజిపిఈజెఏసీ నాయకుల బృందం కలిసి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసింది. జూలై 2026 నుంచి అమల్లోకి వచ్చేలా 2.543 శాతం డీఏ పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, దీంతో విద్యుత్ ఉద్యోగుల డీఏ గతంలో ఉన్న 19.272 శాతం నుంచి 21.815 శాతానికి పెరిగిందని నాయకులు పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్లకు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినందుకు కూడా ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సెలవులు, గ్రాట్యుటీ, పదోన్నతులు తదితర సమస్యలపై దృష్టి సారించాలని గిబి ట్రాన్స్‌కో, గిబి జెన్‌కో, రెండు విద్యుత్ పంపిణీ సంస్థలకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు భట్టి ఆసక్తి చూపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



ఉమ్మడి ఎపి శాసనమండలి మాజీ చైర్మన్ చక్రపాణి కన్నుమూత

సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్, మంత్రులు సంతాపం

హైదరాబాద్,నవంబరు4,ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ డాక్టర్ ఎ. చక్రపాణి కన్నుమూశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. శాసన వ్యవస్థలో విశేష అనుభవం కలిగిన నేతగా, పార్లమెంటరీ సంప్రదాయాలను గౌరవించిన వ్యక్తిగా చక్రపాణి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలిని పునరుద్ధరించిన అనంతరం తొలి ఛైర్మన్‌గా డాక్టర్ ఎ. చక్రపాణి బాధ్యతలు చేపట్టారు. తన పదవీకాలంలో సభా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిం చడంతో పాటు శాసనసభా సంప్రదాయాల పరిరక్షణకు ఆయన విశేష కృషి చేశారు. సభలో ప్రజాస్వామ్య విలువలు, పార్లమెంటరీ విధానాలకు ప్రాధాన్యం ఇస్తూ తనదైన ముద్ర వేశారు. చక్రపాణి మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలి తొలి ఛైర్మన్‌గా ఆయన అందించిన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు.

రిటైర్డ్ సీనియర్ ఐపిఎస్ అధికారి డిసి రోశయ్య కన్నుమూత

హైదరాబాద్,నవంబరు4,ప్రభాతవార్త: రిటైర్డ్ సీనియర్ ఐఏఎస్ అధికారి డి.సి. రోశయ్య (79) బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ లోని స్వగృహంలో వృద్ధాప్య సంబంధిత సమస్యలతో కన్నుమూశారు. రోశయ్య గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సిరిపురంలో 4 అక్టోబర్ 1946న జన్మించారు. పబ్లిక్ ఎడ్మి నిస్ట్రేషన్‌లో డిగ్రీ, హిస్టరీలో పోస్ట్ గ్రాడ్యు యేషన్ చేసిన రోశయ్య 1984లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ సర్వీస్‌లో ప్రవేశించారు. సర్వీస్ లో రోశయ్య సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఇంకా డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్, స్టేట్ ఆర్కైవ్ కమిషనర్, ఇంకా పలు శాఖల హెచ్.వో.డీ. గా పనిచేశారు.

నిజామాబాద్ పోలీసులకు పట్టుబడ్డ అంతరాష్ట్ర దొంగల ముఠా

భారీగా చోరీ సొత్తు స్వాధీనం

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: నిజామాబాద్ జిల్లాలోని పలు చోట్ల పగటిపూట తాళాలు బద్దలు కొట్టి చోరీలకు పాల్పడుతున్న అంత రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి బంగారు, వెండి నగలతో పాటు కారును జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను పోలీసు కమిషనర్ సాయి చైతన్య బుధవారం మీడియాకు వెల్లడించారు.



దొంగల ముఠా వద్ద లభ్యమైన చోరీ సొత్తును పరిశీలిస్తున్న కొత్వాల్ సాయి చైతన్య

మహారాష్ట్రలోని బుల్దాన జిల్లా జవ హర్ నగర్‌కు చెందిన సయ్యద్ షకీల్ (46), (ఇతను ఓ గజదొంగ. గతంలో వరంగల్, నిర్మల్, యదాద్రి భువనగిరి జిల్లాలు, కర్ణాటక, మహా రాష్ట్రలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడు), మహారాష్ట్రలోని బుల్దానా గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ అలియాస్ రాజ్ (37) (ఇతను కూడా గజదొంగ. గతంలో వరంగల్, యదాద్రి భువనగిరి జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్రలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడు) ఇదే ప్రాంతానికి చెం దిన షేక్ ఇమ్రాన్ (32)లు ఒక ముఠాగా ఏర్పడి నిజామాబాద్‌లోని పలుచోట్ల వరుసగా చోరీలు చేయసాగారు. తాళాలు వేసిన ఇళ్లలో చోరీలు చేయడంలో వీరు దిట్ట. ఈ ముఠా గురించి సమాచారం అందుకున్న నవీపేట పోలీసులు పక్కాగా నిఘా వుంచగా బుధవారం ఉదయం పట్టు బడ్డారు.

సిటీ సైబర్ క్రైం విభాగం దాడులు

55 మంది నేరగాళ్ల అరెస్టు..రూ.49.99 లక్షలు బాధితులకు అందజేత

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: జంట నగరాలలో వెలుగు చూసిన సైబర్ నేరాలతో సంబంధం వున్న నేరగాళ్లను పట్టుకునేందుకు సిటీ సైబర్ క్రైం విభాగం దేశ వ్యాప్తంగా ఏడు రాష్ట్రాలలో దాడులు నిర్వహించి 38 కేసులతో సంబంధం వున్న 58 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా 49,99,684 రూపాయలను బాధితులకు అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలను నగర అదనపు పోలీసు క మిషనర్ (క్రైం అండ్ సిట్) ఎం. శ్రీనివాసులు బుధవారం మీడియాకు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలలో తలదాచుకుని హైదరాబాద్‌లో నేరాలకు పాల్పడుతున్న వారిని పట్టుకునేందుకు ఈ దాడులు జరిగాయి.అక్టోబర్ నెలలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) నుంచి అ ందిన ఫిర్యాదులపై స్పందించి హైదరాబాద్ సైబర్ క్రైంలో 129 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించిన నేరగాళ్లను అరెస్టు చేసేందుకు నగర సైబర్ క్రైమ్ పోలీసులు దేశ వ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించి 55 మంది నిందితులను పట్టుకున్నారు.

సత్తుపల్లిలో మురుసు తుఫాన్ ఎఫెక్ట్

- లక్ష టన్నులు బొగ్గుకు అంతరాయం

- నాలుగు లక్షల క్యూబిక్ మీటర్ల ఓబికి ఆటంకం

సత్తుపల్లి నవంబర్4 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావం మూలంగా గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు వల్లసత్తుపల్లి సింగరే ణి ఏరియా పరిధిలోని రెండు ఓపెన్ కాస్టు గనుల్లో నీరు చేరటం మూలంగా మంగళ, బుధ వారాలు బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. జే వి ఆర్ ఓపెన్ కాస్ట్, కిష్టారం ఓపెన్ కాస్ట్ గనులలో లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడగా, ఈ రెండు గనుల్లో 4 లక్షల క్యూబెక్ మీటర్ల ఓవర్ బర్డెన్ (ఓ బి) కి తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఉదయం నుండి బుధవారం వరకు ఏకధాటిగా కురుస్తున్న వర్షం మూలంగా సత్తుపల్లిలో 218 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారుల లెక్కల బట్టి తెలుస్తుంది. సింగరేణి ఏరియాపరిధిలోని రోజువారి జేవిఆర్ ఓపెన్ కాస్టు గనిలో 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుండగా, లక్ష,50, వేల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్(ఓబి)కి, కిష్టారం ఓసి లో పదివేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 50వేల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డే ను(ఓబి) కి ఈవర్షం ప్రభావము మూలంగా రెండు రోజుల్లోనే పైన తెలిపిన రెండు గనులలో లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తికి, నాలుగు లక్షల క్యూబిక్ మీటర్లఓబికి, తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కొడంగల్‌లో మెగా రైతు మేళా

7 నుంచి 9వ తేదీ వరకూ వరకు ఎగ్జిబిషన్ : మంత్రి తుమ్మల

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కొడంగల్‌లో మూడు రోజుల పాటు మెగా రైతు మేళాను నిర్వహించనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ఈ రైతు మేళాను ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఈ మెగా రైతు మేళాలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఆయిల్‌ఫెడ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక శాఖ, బ్యాంకింగ్ సంస్థలు, అనుబంధ సంస్థలు, వాలంతరి, క్రిడా, కేంద్ర ప్రభుత్వ సంస్థలు సహా మొత్తం 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల భాగస్వామ్యంతో సుమారు 150 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలని సైకిల్ యాత్ర

హైదరాబాద్,నవంబరు4,ప్రభాతవార్త: ఉమ్మడి పాలనలో ఆగమైన తెలంగాణ వ్యవసాయాన్ని పండుగ చేసిన పదేండ్ల కేసీఆర్ పాలనలో పసిడి సిరులు కురిపించిన పంట పొలాలు, కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రపూరిత నిరక్ష ్యంతో సుక్కనీరులేక నోర్లు తెరుస్తున్న పరిస్థితిని, రైతుల ఆవేదనను తెలుసుకుంటూ.. తెలంగాణ వ్యవసాయం తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షను ప్రకటిస్తూ.. సైకిల్ యాత్ర చేపట్టింది గోదావరిఖనికి చెందిన యువత. గోదావరిఖని కి చెందిన మాజీ కార్పొరేటర్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో పదిమంది యువకులు కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ దాకా 8 రోజుల పాటు సుమారు 400 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్రద్వారా చేరుకున్నారు. అనంతరం తెలంగాణ మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని వారి ఎర్రవెల్లి నివాసంలో కలిసి తమ యాత్రావివరాలను కేసీఆర్‌కు తెలిపారు. సైకిల్ యాత్ర సందర్భంగా.. సాగునీరు లేక కరెంటు రాక బోర్లు ఎండిపోయి పంటలు ఆగమై ఆవేదన చెందుతున్న రైతుల దు:ఖాన్ని కేసీఆర్‌కు వివరించారు.

హైదరాబాద్ మీర్‌పేట్‌లో దారుణం - అత్త, బావమరిది భార్యను హత్య చేసిన అల్లుడు

కత్తిపోట్ల

కొరియా ఓపెన్‌లో రౌండ్ ఆఫ్‌కు తన్వి



యెయోసు (దక్షిణ కొరియా): కొరియా ఓపెన్ 2026 టోర్నమెంట్‌లో, భారత షట్లర్ తన్వి శర్మ జపాన్‌కు చెందిన మనామి సుయిజును 21-16, 12-21, 21-17 తేడాతో ఓడించి రౌండ్ ఆఫ్ 16కు చేరుకుంది. బుధవారం జరిగిన తొలి గేమ్‌లో తన్వి ఆధిపత్యం చెలాయించి, స్కోరుబోర్డులో ఎప్పుడూ వెనుకబడలేదు. సుయిజు 14-14తో స్కోరును సమం చేసినప్పటికీ, తన్వి తిరిగి పట్టు సాధించి, కేవలం మరో రెండు పాయింట్లు మాత్రమే కోల్పోయి గేమ్‌ను కైవసం చేసుకుంది.

రెండో గేమ్‌ను సుయిజు బలంగా ప్రారంభించి, 6-1 ఆధిక్యాన్ని సాధించింది. తన్వి వరుసగా ఐదు పాయింట్లు సాధించి స్కోరును సమం చేసింది, కానీ 23 ఏళ్ల ఈ జపనీస్ షట్లర్ సంయమనం కోల్పోకుండా 12-12తో స్కోరును సమం చేసింది. ఆ తర్వాత వరుసగా తొమ్మిది పాయింట్లు సాధించి నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడవ గేమ్ హోరాహోరీగా సాగింది. ఇద్దరు క్రీడాకారులు ఆధిక్యాన్ని మార్చుకున్నారు. చివరకు తన్వి 13-9 ఆధిక్యాన్ని సంపాదించి, చివరి నిమిషాల్లో సుయిజు చేసిన పోరాటాన్ని నిలువరించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. రౌండ్ ఆఫ్ 16లో, తన్వి జపాన్‌కు చెందిన హినా అకేచితో నాలుగవసారి తలపడనుంది. ఆమె డిసెంబర్ 2025లో గౌహతి మాస్టర్స్ సెమీఫైనల్‌లో అకేచిని ఓడించింది, కానీ మే 2026లో థాయ్‌లాండ్ ఓపెన్‌లో ఆమె చేతిలో ఓడిపోయింది.

యూత్ ఒలింపిక్స్‌లో రాజకుమారికి

తొలి వుషు పతకం



సెనెగల్: యూత్ ఒలింపిక్ గేమ్స్‌లో, మహిళల చాంగ్‌క్వాన్ కంబైన్డ్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించి, రాజకుమారి లంచెన్నె చాను వుషులో పతకం గెలిచిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించింది. భారత్‌కు చెందిన చాను 18.039 పాయింట్లు సాధించి, ఈజిప్ట్‌కు చెందిన సోండోస్ సోన్‌బోల్ (18.660), వెనిజులాకు చెందిన వలేరియా ఫ్రాన్సెరిస్ డుడామెల్ (18.199)ల తర్వాత మూడవ స్థానంలో నిలిచారు. గున్నులో 8.723 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచిన భారత క్రీడాకారిణి, చాంగ్‌క్వాన్‌లో 9.316 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి పతకాన్ని ఖాయం చేసుకుంది. కాగా భారత యువ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి సిండ్రెలా దాస్, సింగపూర్‌కు చెందిన మింగ్ యింగ్ లాయ్ చేతిలో 7-11, 6-11, 4-11, 6-11 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయి రౌండ్ ఆఫ్ 16లోనే పోటీల నుండి నిష్క్రమించింది. ఆమె అంతకుముందు ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ గెలిచి తన గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది, కానీ ఆ జోరును కొనసాగించలేక ఒక ప్రధాన పతకాన్ని కోల్పోయింది. డాకర్ యూత్ ఒలింపిక్స్‌లో భారతదేశం ఇప్పటివరకు ఒక రజతం, రెండు కాంస్యాలు గెలుచుకుంది. టీనేజర్ ఖుష్బూ రాజక్‌భాయ్ పోడియంను చేరిన రెండవ భారతీయ జూడో క్రీడాకారిణిగా నిలిచి రజత పతకంతో తన ప్రస్థానాన్ని ముగించగా, స్విమ్మింగ్ సంచలనం ధినిధి దేశింఘు మహిళల 100 మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో కాంస్య పతకంతో తన అద్భుతమైన ప్రస్థానాన్ని కొనసాగించింది.

చెన్నై ఓపెన్‌లో మాయ, వైష్ణవి గెలుపు





చెన్నై: భారత టీనేజ్ టెన్నిస్ స్టార్ మాయా రాజేశ్వరన్ రేవతి, వైష్ణవి అడ్కర్ సంచల నాత్మక విజయాలు సాధించి, తమ తొలి డబ్ల్యూటిఎ టూర్ స్థాయి విజయాలను కైవసం చేసుకున్నారు. చెన్నై ఓపెన్‌లో ఈ చిరస్మరణీయ డబుల్ విజయంతో టోర్నమెంట్‌కు కొత్త వెలుగులు అలుము కుంది. మాయా తన కెరీర్ లోనేఅతిపెద్ద విజయం కోసం, ప్రపంచ 115వ ర్యాంకర్, ఎనిమిదో సీడ్ అయిన కటార్జినా కావాను ఉత్కంఠభరితమైన మూడు సెట్ల పోరులో ఓడిం చగా, వైష్ణవి నిర్ణయాత్మక సెట్‌లో 3-5తో వెనుకబడినప్పటికీ కఠినమైన పోరులో బ్రిటన్‌కు చెందిన జోడీ బురేజ్‌ను 3-6 6-3 7-5 తేడాతో అధిగమించింది. నిర్ణయాత్మక సెట్‌లో మాయా 2-5తో వెనుకబడినప్పటికీ, ఓటమిని అంగీకరించని స్ఫూర్తితో పోరాడి, రెండు గంటల 27 నిమిషాల పోరులో పోలిష్ క్రీడాకారిణిని 6-4 2-6 7-6(5) తేడాతో ఓడించింది. 669వ ర్యాంకులో ఉన్న ఈ పోరాటపటిమ గల భారత క్రీడాకారిణి, తనకు ఇచ్చిన వైల్డ్ కార్డ్‌ను సార్థకం చేసుకుంది. తన కంటే దాదాపు రెట్టింపు వయసున్న 33 ఏళ్ల క్రీడాకారిణి రెండవ, మూడవ సెట్లలో పలుమార్లు తీవ్ర ఒత్తిడికి గురిచేసినప్పటికీ, ఆమె మ్యాచ్‌లో ఏ దశలోనూ ఓటమిని అంగీకరించకుండా దూసుకెళ్లింది.

తొలి వన్డేలో భారత్ ఘన విజయం

5 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ చిత్తు



ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా విజ యంతో ప్రారంభించింది. ఆక్లాండ్‌లో బుధవారం జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య జట్టును 5 వికెట్ల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. అనంతరం డీఎల్ఎస్ పద్ధతిలో భారత్ ముందు 32 ఓవర్లలో 143 పరుగుల లక్ష్యాన్ని ఉంచారు. టీమిండియా 22.4 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసి గెలిచింది. మరో 56 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ ఆరంభంలోనే విల్ యంగ్, హెన్రీ నికోల్స్‌ను పెవిలియన్‌కు పంపి కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. ఆ తర్వాత గుర్నూర్ బ్రార్ తన స్పీడు, బౌన్స్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. టిమ్ సీఫర్ట్ 38 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలువగా, డారిల్ మిచెల్ 28, గ్లెన్ ఫిలిప్స్ 30 పరుగులు చేశారు. అర్ష్‌దీప్ 10 ఓవర్లలో 70 పరుగులిచ్చి 4 వికెట్లు, గుర్నూర్ 3 వికెట్లు, అన్‌శుల్ కాంబోజ్ 2 వికెట్లు తీసుకున్నారు. దీంతో న్యూజిలాండ్ 185 పరుగులకే పరిమితమైంది. 186 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. కైల్ జేమీసన్ బౌలింగ్‌లో రోహిత్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. అయితే వన్‌డౌన్‌లో వచ్చిన విరాట్ కోహ్లీ, గిల్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. గిల్ 37 పరుగులు చేసి రెండో వికెట్‌గా వెనుదిరగ్గా, కోహ్లీ మాత్రం బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కేవలం 35 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసినా చివరకు 51 బంతుల్లో 74 పరుగులు చేసి జాకబ్ డఫీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. వెంటనే అక్షర్ పటేల్ కూడా పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ చేరాడు.

ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్ 15 పరుగులు చేసి ఔటయ్యాడు. కేఎల్ రాహుల్, మిగతా బ్యాటర్లు లక్ష్యాన్ని పూర్తి చేసే బాధ్యత తీసుకుని విజయాన్ని అందించారు. దీంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది.

ఐసిసి ర్యాంకింగ్స్:

బౌలింగ్‌లో టాప్ మిచెల్ స్టార్క్

బ్యాటింగ్‌లో నం1: అభిషేక్



దుబాయ్: ఐసీసీ విడుదల చేసిన ర్యాంకింగ్స్ జాబితాలో క్రికెట్ ప్రపంచాన్ని కుదిపేసేలా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. బుధవారం విడుదల చేసిన ఈ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ మళ్లీ టెస్ట్ బౌలింగ్ విభాగంలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. కేవలం ఒక్క వారం వ్యవధిలోనే దక్షిణాఫ్రికా పేసర్ మార్కో యాన్సెన్ నుంచి నంబర్ వన్ కిరీటాన్ని ఆయన తిరిగి సొంతం చేసుకున్నారు. సౌతాఫ్రికా గడ్డపై జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి పాలైనప్పటికీ, మిచెల్ మాత్రం ఏకంగా 11 వికెట్లు పడగొట్టి అదరగొట్టాడు. దీంతో ఆయన ఖాతాలో 881 రేటింగ్ పాయింట్లు చేరాయి. అంతకుముందు అగ్రస్థానంలో ఉన్న మార్కో యాన్సెన్ 875 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. ఇదే సిరీస్‌లో అద్భుతంగా రాణించిన మరో ప్రొటీస్ స్పిన్నర్ సైమన్ హార్మర్ తొమ్మిదవ స్థానానికి ఎగబాకారు. బ్యాటర్ల విభాగంలో ఇటీవల అద్భుతమైన ఫామ్‌లో ఉన్న టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో స్థానానికి చేరుకున్నారు. ఈ జాబితాలో మరో ఓపెనర్ అభిషేక్ శర్మ తొలి స్థానంలో కొనసాగుతుండగా, ఇషాన్ కిషన్ మూడో స్థానంలో ఉన్నారు. మరోవైపు న్యూజిలాండ్ ప్లేయర్ గ్లెన్ ఫిలిప్స్ భారత్‌తో జరిగిన సిరీస్‌లో అద్భుతంగా రాణించి ఏకంగా 13 స్థానాలు ఎగబాకి 24వ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది ఒక స్థానం ఎగబాకి ఐదో స్థానానికి చేరుకున్నారు. హారీస్ రౌఫ్ ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 24వ స్థానానికి వెళ్లారు. శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీ బాదిన ఓపెనర్ ఫఖర్ జమాన్ తొమ్మిది స్థానాలు ఎగబాకి 37వ స్థానానికి చేరుకున్నారు.

అరబిందో రాబడి రూ.10,623కోట్లు



హైదరాబాద్, నవంబరు 4: ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా తన ఆర్థిక పనితీరులో రికార్డు నమోదుచేసింది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ రూ.10,263 కోట్ల అత్యధిక ఆదాయాన్ని సాధించింది. గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయంలో 23.9 శాతం వృద్ధి నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో బలమైన వ్యాపార విస్తరణ, సమర్థవంతమైన నిర్వహణ ఈ వృద్ధికి దోహదపడ్డాయి. కంపెనీ నిర్వహణ లాభదాయకత లోనూ గణనీయమైన పురోగతి సాధించింది. ఎబిడిటా 28.5 శాతం పెరిగి రూ.2,156 కోట్లకు చేరింది. ఎబిడిటా మార్జిన్ 75 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 21 శాతానికి చేరుకుంది. పన్నులకు ముందు లాభం 32.7 శాతం వృద్ధితో రూ.1,691 కోట్లకు, నికర లాభం 32.5 శాతం పెరుగుదలతో రూ.1,124 కోట్లకు చేరింది. అరబిందో ఫార్మా అన్ని ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లలో మంచి వృద్ధిని నమోదు చేసింది. అమెరికా వ్యాపారం 25 శాతంవృద్ధితో రూ.4,555కోట్లకు చేరింది.యూరప్ వ్యాపారం 27 శాతం వృద్ధితో రూ.3,161 కోట్లకు పెరిగింది. గ్రోత్ మార్కెట్స్ విభాగం 16 శాతం వృద్ధితో రూ.1,026 కోట్ల ఆదాయాన్ని సాధించింది. కంపెనీ మొత్తం ఆదాయంలో అంతర్జాతీయ వ్యాపారం సుమారు 92 శాతం వాటాను కలిగి ఉంది. ఇది ప్రపంచ మార్కెట్లలో అరబిందో ఫార్మా విస్తృత కార్యకలాపాలకు నిదర్శనంగా నిలుస్తోంది. లానెట్ కంపెనీ కొనుగోలు చేయడం ద్వారా అమెరికా మార్కెట్లో అరబిందో ఫార్మా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఈ త్రైమాసికంలో వ్యూహాత్మక మూలధన వ్యయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా అరబిందో ఫార్మా 146 మిలియన్ అమెరికన్ డాలర్ల ఉచిత నగదు సాధిం చింది. సెప్టెంబరు చివరి నాటికి పెట్టుబడులతో కలిపి కంపెనీ నికర నగదు నిల్వలు రూ.1,812 కోట్లుగా నమోదయ్యాయి దీర్ఘకాలిక ఉత్పత్తుల అభివృద్ధి, వినూత్న ఔషధాల తయారీ కోసం కంపెనీ పరిశోధన, అభివృద్ధి కార్యకలా పాలపై పెట్టుబడులను కొనసాగిస్తోంది. ఈ త్రైమాసికంలో ఆర్‌అండ్‌డి కోసం రూ.376 కోట్లు ఖర్చు చేసింది. వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.7 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

ఐపిఒకు వస్తున్న రేజర్ పే

రూ.6వేల కోట్ల సమీకరణ టార్గెట్

ముంబయి, నవంబరు 4: దేశీయ స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించేందుకు మరో ప్రముఖ ఫిన్‌టెక్ దిగ్గజం రేజర్ పే సిద్ధమైంది. ఐపిఒ ద్వారా రూ. 6000 కోట్ల మేర నిధులు సమీకరణ లక్ష్యంగా కంపెనీ దాఖలు చేసిన దరఖాస్తుకు భారతీయ మూలధన మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. రహస్యవిభాగానికి చెందిన కాన్ఫిడెన్షియల్ రూట్‌లో పత్రాలు దాఖలు చేసింది. ప్రాథమిక మార్కెట్ ద్వారా దాదాపు 5 బిలియన్ డాలర్లు అంటే భారత దేశ కరెన్సీలో దాదాపు రూ. 47 వేల కోట్లు మార్కెట్ విలువను సాధించే దిశగా ప్రణాళికలు రచిస్తోంది. రేజర్ పే జూన్ నెలలోనే కాన్ఫిడెన్షియల్ రూట్ ద్వారా సెబీవద్ద ముసా యిదా పత్రాలు దాఖలు చేసింది. సెబీ తుది అనుమతులు ఇచ్చే వరకు ఈ కాన్ఫిడెన్షియల్ ఐపిఒ ముసాయిదా పత్రాల వివరాలు సాధారణ ప్రజలకు అందుబాటులోకి రావు. 2014లో శశాంక్ కుమార్, హర్షిల్ మాథుర్ కలిసి ఫిన్‌టెక్ సంస్థ రేజర్ పేను స్థాపించారు. తన వ్యాపారాన్ని వేగంగా విస్తరించిన ఈ ఫిన్‌టెక్ సంస్థ 1 బిలియన్ డాలర్ల విలువైన కంపెనీగా 2020లో యూనికార్న్ జాబితాలోకి ప్రవేశించింది. ఫోన్ పే వంటి ఇతర పోటీ ఫిన్‌టెక్ కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల కారణంగా తమ ఐపీఒ ప్రణాళికలను తాత్కాలికంగా వాయిదా వేసుకోగా, రేజర్ పే సెబీ అనుమతి సాధించడం గమనార్హం.

ఐదోరోజూ లాభాల్లోనే సెన్సెక్స్, నిఫ్టీ



ముంబయి, నవంబరు 4: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివర్లో కొనుగోళ్ల మద్దతుతో పుంజుకున్నాయి. దీంతో వరుసగా ఐదో సెషన్‌లోనూ లాభాలు నమోదయ్యాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 383.55 పాయింటు పెరిగి 77,301.40 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 149.75 పాయింట్లు లాభపడి 23,960.60 వద్ద ముగిసింది. ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు కొద్దిసేపటికే ఒత్తిడికి లోనై నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 76,604.85 కనిష్ఠ స్థాయిని తాకింది. అక్కడి నుంచి కోలుకుని 77,396.04 గరిష్ఠ స్థాయికి చేరింది. నిఫ్టీ కూడా 23,696.15 కనిష్ఠ స్థాయి నుంచి పుంజుకుని 23,960.60 వద్ద ట్రేడింగ్ ముగించింది. బ్యాంకింగ్, ఆటో, మెటల్, మీడియా రంగాల షేర్లలో కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి. సెన్సెక్స్ షేర్లలో భారత్ ఎలక్ట్రానిక్స్ (బిఇఎల్) 4.56 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. టైటాన్ 4.28 శాతం, ఇండిగో 2.39 శాతం, బజాజ్ ఫైనాన్స్ 2.38 శాతం, ఐటిసి 2.32 శాతం చొప్పున పెరిగాయి. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. ఐటీ షేర్లు మార్కెట్ లాభాలకు కొంతమేర అడ్డుకట్ట వేశాయి. టిసిఎస్ 2.70 శాతం నష్టంతో సెన్సెక్స్‌లో అత్యధికంగా పడిపోయింది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 2.23 శాతం, ఇన్ఫోసిస్ 1.65 శాతం చొప్పున నష్టపోయాయి. ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు కూడా నష్టాల్లో ముగిశాయి రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మీడియా సూచీ 5.15 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. మెటల్ 2.80 శాతం, రియల్టీ 2.85 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 2.04 శాతం, ఎఫ్ఎంసిజి 1.50 శాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫార్మా సూచీలు కూడా లాభపడ్డాయి. నిఫ్టీ ఐటీ 1.50 శాతం క్షీణించింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2 శాతం, మిడ్‌క్యాప్ 100 సూచీ 1.55 శాతం పెరిగాయి. మార్కెట్ ఒడుదొడుకులను సూచించే ఇండియా విక్స్ 2.83 శాతం తగ్గి 15.28కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు స్వల్పంగా తగ్గాయి. డబ్ల్యూటీఐ క్రూడ్ బ్యారెల్ 95.95 డాలర్ల వద్ద, బ్రెంట్ క్రూడ్ 102.84 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

వచ్చే ఆదివారమే ముహూరత్ ట్రేడింగ్

ముంబయి, నవంబరు 4: భారతీయ స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు దీపావళి పండుగ కేవలం వెలుగుల పండుగ మాత్రమే కాదు. కొత్త ఆర్థిక సంవత్సరమైన సంవత్ 2083కి శ్రీకారం చుట్టే శుభ సమయం. ప్రతీ యేటా దీపావళి లక్ష్మీ పూజ రోజున బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రత్యేకంగా నిర్వహించే ముహూరత్ ట్రేడింగ్ షెడ్యూల్ ఖరారైంది. ఈ రోజున ట్రేడింగ్ చేయడం వల్ల సంవత్ పొడవునా ఐశ్వర్యం, సంపద వృద్ధి చెందుతాయని ఇన్వెస్టర్లు విశ్వసిస్తారు.

ఈసారి నవంబరు 8 ఆదివారం రోజున లక్ష్మీ పూజ పర్వదినాన ఎన్ఎస్ఇ, బిఎస్ఇలో ఈ ప్రత్యేక ప్రత్యక్ష ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించనున్నారు. బ్లాక్ డీల్ విండో మధ్యాహ్నం 1:50 నుంచి 2:05 వరకు ఉంటుంది. ప్రీఓపెన్ సెషన్ మధ్యాహ్నం 2:05 నుంచి 2:20 వరకు సాధారణ ఈక్విటీ మార్కెట్ మధ్యాహ్నం 2:20 నుంచి 3:30 వరకు. ఎఫ్ఓ అండ్ డెరివేటివ్స్ మార్కెట్: మధ్యాహ్నం 2:20 పీఎం నుంచి 3:40 వరకు సాగుతుంది. క్లోజింగ్ సెషన్ మధ్యాహ్నం 3:50 నుంచి 4 పిఎం వరకు ఉంటుంది.

ముహూరత్ ట్రేడింగ్ అనేది కేవలం సాంకేతిక లేదా ప్రతీకాత్మకమైనది కాదు. ఈ సెషన్‌లో మీరు కొనుగోలు లేదా విక్రయం చేసే ప్రతి షేరు సాధారణ ట్రేడింగ్ రోజు లాగే అసలైన సెటిల్మెంట్ బాధ్యతను కలిగి ఉంటుంది. చాలా మంది ఇన్వెస్టర్లు తమ పోర్ట్ ఫోలియోకు మంచి క్వాలిటీ ఉన్న బ్లూచిప్ షేర్లను టోకెన్ ప్రాతిపదికన కొనుగోలు చేసి సంవత్ ప్రారంభాన్ని జరుపుకుం టారు. సాధారణంగా 1 గంట లేదా 1 గంట 10 నిమిషాలు మాత్రమే మార్కెట్ నడవడం వల్ల స్వల్పకాలికంగా మార్కెట్లో హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉంది. మీ బ్రోకరేజ్ ప్లాట్ ఫారమ్ అనుమతించే టైమింగ్స్, ఆఫ్ మార్కెట్ ఆర్డర్ రూల్స్ ముందే తనిఖీ చేసుకోవడం శ్రేయస్కరం.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.